
అర్ధరాత్రి
డిటెక్టివ్ అండ్ మిస్టరీ నవల
రచన
కమేడల
వెల
0-8-0

# మహామాయ-1

# అర్ధరాత్రి

(డిటెక్టివ్ & మిస్టరీ నవల)

రచన:

కనకమేడల

JAIDEV PRASAD
SWEET'S SHOP
GARLA-507 210.
Khammam Dist. (A. P.)

విజ్ఞాన సాహితి

టి. నగర్ :: మద్రాసు-17

ద్వితీయ ముద్రణ
జూలై 1956

## ఒకమాట!

మహామాయ - డిటెక్టివ్ & మిస్టరీ సీరియల్ నవలలో ఇది మొదటి పుస్తకానికి ద్వితీయ ముద్రణ. ప్రతి పుస్తకానికి ప్రత్యేకమైన పేర్లు ఉంచడం భావ్యమని తలచాం. ఈ పుస్తకం పేరుఅర్ధరాత్రి. ఇలాంటిపుస్తకాలు ఈ సీరియల్‌లో కొన్ని వెలువడతాయి, ప్రతిపుస్తకంలోని కథకు సంబంధం ఉంటుంది. కాని ఏ పుస్తకంలోని కథ ఆ పుస్తకంలో పూర్తయినట్లని పిస్తుంది. ప్రతి పుస్తకంలోను వెనుకటి పుస్తకంలోని కథ అతిక్లుప్తంగా ఇవ్వబడుతుంది. ఏజెంట్లు ప్రతి పుస్తకాన్ని తప్పక తెప్పించి పాఠకులకు అందచెయ్యాలి. ఏ పుస్తకమైనా వెంటనే తెప్పించుకోవచ్చు. పాఠకులు ప్రతి నెల తమ పుస్తకాలకోసం ఏజెంట్లను ముందుగానే అడిగి రిజర్వు చేసుకుంటే మంచిది. ఏజెంట్ల. పాఠకుల సహకారం మేం నిత్యమూ అభ్యర్థిస్తున్నాము.

—డైరెక్టర్

వెల
**0-8-0**

ఎం. వి. యస్. ప్రెస్
మద్రాసు-1.

# అర్ధరాత్రి

ప్రతాప్ మేడమీద కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా క్రింద గోదావరి మహానది ప్రశాంతంగా ప్రవహిస్తోంది. వెన్నెల దిగంతాలదాకా పుచ్చపువ్వులా వ్యాపించి ఉంది. ఆ వెన్నెల వెలుగులో గోదావరి తరంగాలు తెల్లగా మెరుస్తున్నాయి.

ప్రతాప్ గోదావరి నది వంక చూశాడు. ఆ మహానది అతని భావుక హృదయంలో ఏవేవో అనుభూతుల్ని రేప సాగింది. ఆలోచిస్తున్న ప్రతాప్ కళ్ళు ప్రక్కకు తిరిగాయి. ప్రక్కనే మరో కుర్చీలో కూర్చున్న జయంత్ కూడా దీక్షగా నది వంక చూస్తున్నాడు. విశాలమైన శయ్యలో ప్రవహిస్తున్న ఆ మహానదిని పౌర్ణమి వెన్నెల్లో చూస్తుంటే అతనిలో ఏదో ఉత్సాహం ఉరకలెత్త సాగింది.

నిస్తబ్ధతను చీలుస్తూ ప్రతాప్ అన్నాడు.

'ఈ నిండు వెన్నెలలో మహానది ఎంత అందంగా ఉందో చూశావా?'

'నదిని చూస్తుంటే నా హృదయంలో ఆనంద సాగరం పెల్లుబుకుతోంది,' జయంత్ నెమ్మదిగా అన్నాడు.

'చిన్నప్పుడు నదిలో హాయిగా ఆనందంగా ఈదేవాళ్ళం.

పెద్ద వాళ్ళమైంతర్వాత ఆ ధ్యాసేలేదు. కాని ఇప్పుడుమళ్ళీ నాకు చిన్న తనపు రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఒకసారి ఈ వెన్నెల్లో నదిలో ఈదితే ఎంత హాయిగా ఉంటుంది,' ప్రతాప్ నదివంక చూస్తూ హుషారుగా అన్నాడు.

'నాకూ అలాగే అనిపిస్తోంది. చిన్నప్పుడు పందాలు వేసుకుని చాలా దూరంవరకు ఈదుతుండే వాళ్ళం. ఎలాగైనా, చిన్నప్పుడు ఉండే స్వేఛ్ఛ పెద్దయింతర్వాత ఉండదనుకో.'

'ఇప్పుడోసారి నదిలో ఈధాలని ఉంది; బయలుదేరు,' అన్నాడు ప్రతాప్.

'ఇప్పటికిప్పుడు బయలుదేరి నదిలో ఈదడం మంచిది కాదు. పైనుండి చూడడానికి నది ఎంత ప్రశాంతంగా ఉన్నా పౌర్ణమి రోజున పెద్ద పెద్ద అలలు లేస్తూనే ఉంటాయి.' జయంత్ అన్నాడు.

'నదిలో ఈదడానికి జంకుతున్నావా?'

'నేనేమీ జంకడంలేదు. కాని నదిలో ఈదడానికి ఇది అనువైనసమయం కాదంటున్నాను. అంతే.'

ప్రతాప్ మాట్లాడలేదు. నది వంకే చూస్తూ కాసేపు మౌనంగా ఉండిపోయాడు. ఒక్క నిమిషం ఆగి జయంత్ మళ్లీ ఇలా అన్నాడు.

'ఇప్పుడు నదిలో ఈదడం కంటే ఒక అందమైన బోటు మీద షికారుకి వెళ్తే బాగుంటుంది.'

'సరే వెళ్దాం పద,' ప్రతాప్ అన్నాడు.

ఇద్దరూ లేవబోయారు. ఇంతలో నౌకరు ఒకడు మేడ మీదికి వచ్చి ఇద్దరికీ నమస్కారం చేశాడు.

'ఏమిటి?' ప్రతాప్ అడిగాడు.

నౌకరు నెమ్మదిగా ఇలా చెప్పాడు.

'ఎవరో పొరుగూరినుంచి ఒక వ్యాపారి వచ్చాడు. మిమ్మల్ని చూడాలంటున్నాడు. ఆతను మీ నాన్నగారి దగ్గర కొలువులో చాలాకాలం పని చేశాడట. మిమ్మల్ని తన చేతులమీదుగా ఎత్తుకొని పెంచానంటున్నాడు. ఇక్కడినించి వెళ్ళిపోయి చాలా కాలమైందిట. ఒకసారి మీ దర్శనాలు చేసుకు వెళ్దామని వచ్చాడట. నాన్నగారిని చూశాడట. ఇప్పటి వరకు అక్కడే ఉన్నాడట. మిమ్మల్ని కూడా ఓసారి చూడాలని వచ్చాడు. లోపల అతన్ని నిలబెట్టి నేను పైకి వచ్చాను, పంపించమంటారా?'

ప్రతాప్‌కు ఏంతోచలేదు. నదిలో పడవ షికారుకు బయలుదేరదామనుకుంటూంటే మధ్యలో ఇదొకటి వచ్చింది.

'పోనీ రమ్మని చెబుదాం. ఒక ఐదు నిమిషాల్లో అతన్ని పంపివెయ్యొచ్చుగా. మునిగిపోయిందేముందీ,' అన్నాడు జయంత్.

'సరే, పంపించు.' అన్నాడు ప్రతాప్ నౌకరుతో. నౌకరు క్రిందకు వెళ్ళిపోయాడు. కాస్సేపట్లో ఒక ముసలి మనిషి అతి వినయంగా ప్రతాప్ జయంలకు నమస్కారం చేస్తూ పైకి వచ్చాడు. రాగానే ఆ వెన్నెల్లో తళ తళ మెరుస్తున్న రెండు ఉంగరాల్ని ఇద్దరికీ ఎంతో ఆప్యాయతతో బహూకరించి 'ఎంతకాలమైంది బాబుగార్లను చూచి,' అన్నాడు.

'చిన్నప్పుడెప్పుడో మమ్మల్ని చూచి ఉంటావు. నిన్నసలు మేం గుర్తుపట్టలేకుండా ఉన్నాం కూడా'' జయంత్ నెమ్మదిగా అన్నాడు.

'అప్పుడు మీరు చాలా చిన్నవారు బాబూ. మిమ్మల్ని నేను నాచేతుల్లో పెంచానంటే నమ్మండి.' ముసలివాడు ఎంతో గౌరవంగా అన్నాడు.

'సరే మేం వేరే పని మీద బయటికి వెళ్ళాలనుకొం

టున్నాం. నువ్వూ అలసిపోయినట్లు కనిపిస్తున్నావ్. రాత్రి పూట చూసేదేముంది కానీ!—క్రింద వసతి గృహంలో నీకు ఏర్పాట్లు చెయ్యమని నౌకరుకు ఆజ్ఞాపిస్తాను. రాత్రి సుఖంగా గడుపు. రేపు ఉదయం మమ్మల్ని కలుసుకుందువుగాని,' ప్రతాప్ అన్నాడు.

ముసలి వ్యాపారి చిరునవ్వు నవ్వాడు.

'అబ్బాయిలు ఎక్కడికో వెళ్ళాలనుకుంటూంటే నేను ఆపడం బాగుండదు. మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను,' అంటూ అతను లేచి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ క్రిందకి దిగి వెళ్ళి పోయాడు.

వెళ్ళి పోయేంతవరకు ఆముసలతని వంక చూస్తున్న ప్రతాప్ దృష్టి అకస్మాత్తుగా అతను తనకిచ్చిన ఉంగరం మీద పడింది. ఒక్కసారిగా అతను ఉలిక్కి పడ్డాడు. కళ్ళు నులుముకు చూశాడు. తర్వాత జయంత్ కేసి అతని దృష్టి మళ్ళింది. జయంత్ తన ఉంగరం వంక చూస్తున్నాడు. ఐతే అతని ముఖంలో ఆశ్చర్య చిహ్నలేవీ లేవు.

ఆ నిండు వెన్నెల్లో ప్రతాప్ మళ్ళీ తన ఉంగరం కేసి చూశాడు. దానిమీద ఒక లావణ్యవతి ఫొటో అమర్చబడి ఉంది. ఫొటో ఎంత చిన్నదైనా దానిని తయారు చేసినవ్యక్తి చాలా నేర్పరి. యౌవనములో ఉన్న ఆ యువతి సౌందర్యాన్ని ఒలికిస్తూ తనతో మాట్లాబోతున్నట్టుంది అనుకున్నాడు ప్రతాప్. క్షణంలో అతని మనస్సుని ఆ ఫొటో వశపర్చుకుంది. ఆ ఉంగరాన్ని ఒకసారి తన హృదయానికి హత్తుకో వాలనుకున్నాడు కాని ఏమిటీ పిచ్చితనం! ఫొటోలో ఉన్న ఆ సౌందర్యవతిని చూసి తను లొంగిపోవడమేమిటి!

ఎంత వద్దనుకున్నా ప్రతాప్ ఆ ఫొటోలోని సుందరిని గురించి ఆలోచించకుండా ఉండలేక పోయాడు. ఆమె తన

మనస్సును చలపర్చుకున్నట్టే లేక్క. ప్రత్యక్షంగా తన ముందుకువచ్చి నిలబడిన ఎందరో అందగత్తెలను చూసినా అతని మనస్సు చలించలేదు. కాని ఈఫొటోలోని యువతి అతన్ని తలవేసి పట్టుకొన్నట్టుంది.

ఈ యువతి ఎవరో, ఆమెఫోటో ఈ ఉంగరంలో ఎందుకుందో, ఈ ఉంగరాన్ని ఆముసలి వ్యాపారి తనకెలా బహూకరించాడో - ప్రతాప్ మనస్సులో అనేక ప్రశ్నలు ఒక దానివెనుక మరొకటి లేచాయి.

ముందు ఆ వ్యాపారిని పిలిపించి అతని వృత్తాంతమంతా కనుక్కోవాలి. తర్వాత ఈసుందరి విషయం తెలుసుకోవాలి అని నిర్ణయించుకొన్నాడు ప్రతాప్. కాని వ్యాపారిని పిలిపించడానికి ఇది సమయంకాదు. ఇంత అవసరంగా అతన్ని పిలిపిస్తే అందరూ ఏమిటో విశేషంఅని అనుమాన పడతారు. తనరహస్యం ఎవరికీ తెలియదు. ఒంటరిగా రేపు ఉదయం పిల్చి సంగతి సందర్భాలు కనుక్కోవాలి. ఇప్పుడు బోటు మీద గోదావరిలో షికారు వెళ్ళవలసిందే-ప్రతాప్ నిర్ణయించు కొన్నాడు.

'నా ఉంగరంమీద ఉన్న వజ్రం చాలా విలువైందిలా కనిపిస్తోంది. ఇంత విలువైన ఉంగరాన్ని బహూకరించిన ఆ వ్యాపారి ధనవంతుడై ఉండాలి,' అన్నాడు జయంత్ ప్రతాప్ కేసి చూస్తూ.

పరధ్యానంగా ఉన్న ప్రతాప్ ఔనన్నట్టు తలపంకించి ఊరుకొన్నాడు. ఏమీ మాట్లాడలేదు.

'మరి షికారు బయల్దేరదామా?' జయంత్ అడిగాడు.

'అందుకు అభ్యంతరమేముంది!' ప్రతాప్ సమాధానమిచ్చాడు.

జయంత్ రెండుసార్లు చప్పట్లు కొట్టాడు. బయట వేచి ఉండే నౌకరు గబగబా దగ్గరికివచ్చి నమస్కారంచేసి నిల బడ్డాడు.

'గోదావరిలో ఈ వెన్నెల్లో పడవమీద షికారు బయలు దేరాలను కుంటున్నాం. చక్కగా అలంకరించిన ఓబోటును బోటు నడపడానికి ఓమనిషిని వెంటనే సిద్ధంచేయించు,' జయంత్ ఆజ్ఞాపించాడు.

'ఇంతరాత్రివేళా?' నౌకరు సందేహంగా అడిగాడు.

'ఔను,' ప్రతాప్ అధికార స్వరంతో బిగ్గరగా అన్నాడు. నౌకరువెళ్ళి పోయాడు.

ఒక చక్కనిబోటులో ప్రతాప్ జయంత్ బయలు దేరారు. బోటు నడిపేమనిషికూడా వాళ్ళతోపాటు ఉన్నాడు. నదిమధ్యలోకి పడవనుతీసుకెళ్ళి వాలుగా దానిని వదిలేశాడు పడవమనిషి. ప్రవాహంతోపాటు పడవ ముందుకు సాగింది. ఆహ్లాదకరమైన ఆ వెన్నెల్లో నదీతీరాలలోని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తుంటే, నదీజలం మీదనించి చల్లగాలి మెల్లగా శరీరాల్ని తాకి పులకరింప చేస్తుంటే వాళ్ళు మైమరచి పోసాగారు.

మనోయాసంగా పడవ నదిలో నాలుగుమైళ్లు వెళ్ళిపో యింది. వ్యాపారి తనకు బహూకరించిన ఉంగరంలోని అంద గత్తె ఇంకా ప్రతాప్ మనస్సులో మెరుపులా మెరుస్తూనే ఉంది. పడవ ఒక చిన్న అడవి ప్రాంతంలోకి చేరింది. అడవి లోంచి నక్కలఊళలతోపాటు ఏవేవో వింత అరపులు కూడా వినిపిస్తున్నాయి.

ఆ అరపులన్నిటి మధ్యగా ఏదో మృదుమధుర సంగీతం వాళ్ళచెవుల్లో పడింది. వీనులవిందైన మురళీనాదం, దానితో పాటు చక్కని గానాలాపనలు వాళ్ళిద్దరినీ విశేషంగా ఆకర్షిం

చాయి. ఏవో ఆలోచనలమధ్య, ఏదో అనిర్వచనీయమైన ఆనందంతో మైమరచిఉన్న ప్రతాప్ సైతం ఆ సంగీతం వినవస్తున్న వైపు చూడకుండా ఉండలేక పోయాడు.

ఒడ్డున ఎవరూ కనిపించలేదు. కాని వినవస్తున్న సంగీతాన్నిబట్టి అంచనావేస్తే ఒడ్డుకుసమీపంలోనే ఆగానోత్సవం జరుగుతున్నట్టు తెలిసింది.

'ఆడవాళ్ళ గొంతుల్లా ఉన్నాయి,' జయంత్ నెమ్మదిగా అన్నాడు, సంగీతం వినవస్తున్నవైపే చూస్తూ.

'అందులో సందేహంలేదు. ఆడవాళ్ళే. ఐతే వాళ్ల ఈ గానోత్సవానికి తగిన సమయం ఇదేనా! అందులోనూ అడవిలో,' ప్రతాప్ ఆశ్చర్యంగా అన్నాడు.

'అర్ధరాత్రివేళ అప్సరసలు దేవలోకాన్నించి దిగి అడవుల్లో నృత్యగానాలు చేస్తూ ఆనందిస్తారని అనుకుంటారు బాబూ,' అన్నాడు పడవమనిషి.

ఈ మాటమీద ప్రతాప్‌కు జయంత్‌కు నమ్మకంలేక పోయినా అసలు ఆపాటలు పాడేదెవరో చూడాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. పడవ నడిపే మనిషి సందేహించాడు కాని అతడిమాట వినేదెవరు?

అవతలి ఒడ్డున పడవనిలిపి ప్రతాప్, జయంత్ అడవిలోకి నడిచారు. 'త్వరగారండి బాబూ,' అంటూ పడవ మనిషి అక్కడే ఉండిపోయాడు పడవకి కాపలాకాస్తూ.

కొంచెందూరం వెళ్లేసరికి ఒక పెద్దచెట్టుదగ్గర పదిహారుగురు యువతులు కనిపించారు. విలువైన అలంకారాలు దుస్తులతో వాళ్ళు అప్సరసలలాగే ఉన్నారు. మధ్యలో ఒక అందమైన యువతి పెద్ద రాతిబండమీద కూర్చుని మురళి వాయిస్తోంది. చుట్టూ మిగిలిన యువతులు గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతూ నాట్యం చేస్తున్నారు.

ప్రతాప్, జయంత్ కొంచెం ముందుకు సాగారు. వాళ్లెవరో తెలుసుకోవాలనే అభిలాష క్షణంలో ఎక్కువయింది. ప్రతాప్, జయంత్ ఆటూరావడం మాని చుట్టూ నాట్యం చేసే యువతులు మధ్య యువతిని [illegible] వదిలి పారిపోయారు. [illegible] రాతిమీద ఉన్న యువతి మాత్రం నిస్తబ్ధంగా ఒంటరిగా [illegible] కూర్చుండిపోయింది.

'వాళ్ళందరూ పారిపోతున్నారు,' జయంత్ అన్నాడు.

'వాళ్ళెటు పారిపోతున్నదీ నువ్వు చూడు. నేను ఆ రాతిమీద కూర్చున్న యువతి దగ్గరకు వెళ్తాను,' అన్నాడు ప్రతాప్ జయంత్ తో.

జయంత్ ప్రతాప్ నుండి వేరుపడి మరో ప్రక్కగా ఆ యువతులు వెళ్ళినవైపు నడిచాడు. ప్రతాప్ ముందుకు సాగిపోయాడు. కొంచెం దగ్గరకు వెళ్లగానే ఆ యువతి వంక ప్రతాప్ పరీక్షగా చూశాడు. అతని ఆశ్చర్యానికంతు లేదు. అదే యువతి! తనకు వ్యాపారి ఇచ్చిన ఉంగరంలోని ఫొటోలో యువతి! తన హృదయాన్ని సంపూర్ణంగా ఆకర్షించుకొన్న సౌందర్య లక్ష్మి. తన హృదయంలోని కోర్కె తీరినందుకు, తనవాకర్షించిన లావణ్యవతిని చూడగలిగినందుకు ప్రతాప్ ఎంతగానో ఆనందించాడు. ఇదంతా అతనికో కలలా అనిపించింది. నిజంగా ఈమె అప్సరసకాని, దేవకన్యకాని కాదుగదా అనుకున్నాడు తనలో. నెమ్మదిగా ఆ యువతిని సమీపించాడు. ఆమె అతనివంక కళ్ళెత్తి చూసింది.

జయంత్ మిగిలిన యువతులు వెళ్లినవైపు పరుగు తీశాడు. వాళ్లు కనిపించినట్టే కనిపించి మళ్లీ మాయమయ్యారు. వాళ్ళను వెంబడిస్తూ జయంత్ చివరికొక కొండగుహ చేరుకున్నాడు. అక్కడెక్కడైనా వాళ్లు దాక్కున్నారేమోనని.

అచుట్టు ప్రక్కల అంతా వెదికాడు కాని వాళ్ళు కాడలేదు. చివరకు నిరాశ గా వచ్చిన త్రోవనే వెనక్కి నడిచాడు.

ఆ చెట్టు దగ్గరకు వచ్చాడు. ఆ రాతి వంక చూశాడు. అక్కడెవరూ లేరు. ప్రతాప్ కూడా కనిపించలేదు. జయంత్ రెండు మూడుసార్లు పిల్చాడు కాని ఎక్కడినించీ జవాబు రాలేదు. ఆయువతి, ప్రతాప్ ఎక్కడికి వెళ్ళింది జయంత్ ఊహించలేక పోయాడు.

ఒకవేళ పడవదగ్గరకు వెళ్ళాడేమోనని జయంత్ కొట్టుకొంటూ నదిఒడ్డుకు నడిచాడు. కాని అక్కడా ప్రతాప్ లేడు. పడవమనిషి పడవదగ్గరకు ఎవరూ రాలేదని చెప్పాడు. జయంత్ కొంచెం కంగారుపడ్డాడు. వినా ప్రతాప్ జాడ తెలుసుకోకుండా ఇంటికి వెళ్ళకూడదనుకున్నాడు. జరిగిందంతా పడవమనిషికి చెప్పి ఈ సంగతంతా నగరంలో తెలియచెయ్యమన్నాడు జయంత్. మళ్ళీ అడవిలోకి ప్రవేశించాడు.

ప్రతాప్ జాడ తెలియలేదన్న సంగతి వినగానే పడవమనిషికి గుండెపగిలినంత పనైంది. పడవమీద అవతలి ఒడ్డుకు చేరుకొని దాన్ని అక్కడే వదలి ఏడుస్తూ కేకలు పెడుతూ నగరంవైపు పరుగు తీశాడు.

## 2

రాజభవనంలో గగ్గోలు బయలుదేరింది. నౌకర్లు సేవకులు కూడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. కంగారు, ఆతురత అందరిలోనూ ఎక్కువయ్యాయి. రాజకుమారులు గోదావరి నదిలో పడవమీద షికారు వెళ్ళారని, తిరిగి రాలేదనీ, ఏమైందీ తెలియటంలేదని అందరూ అనుకోసాగారు.

అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న నరేంద్ర మహారాజుకు రాజకుమారులు కనిపించడం లేదన్న వార్త తెలియచేయబడింది. ఆయన కంగారుగా మంచం మీదనించి లేచాడు. రాజకుమారులు కనిపించడంలేదని తప్ప వివరాలేమీ తనకు తెలియలేదు.

నరేంద్రమహారాజు అంతఃపురంలోంచి బయటికి వచ్చాడు. ఎందరో సేవకులు నౌకర్లు ఆయన రాకకోసం ఎదురు చూస్తున్నారు. అప్పటివరకు ఎంతో గల్లంతు చేస్తున్న వాళ్ళు మహారాజును చూసి మౌనం వహించారు.

'ఏం జరిగింది?' మహారాజు బాధగా, కోపంగా ప్రశ్నించాడు.

'రాజకుమారులు కనిపించడంలేదు,' ఒక సేవకుడు అతి వినయంగా జవాబిచ్చాడు.

'ఏమైనట్లు?'

'తెలియదండి. పడవమనిషి మాత్రం ఏవో కొన్ని విషయాలు చెబుతున్నాడు.'

'వెంటనే వాడిని పిలిపించు,'

ఆ సేవకుడు అక్కడి నించి వెళ్ళిపోయాడు.

'తంత్రవహిని కూడా పిలవండి,' మహారాజు ఆజ్ఞాపించాడు. మరో సేవకుడు మంత్రిగారి కోసం పరుగుతీశాడు.

రెండు మూడు నిమిషాలు గడిచిందో లేదో తంత్రవహి మహారాజు ఎదటికి వచ్చి నమస్కారం చేశాడు. ఆయన విషాద వదనాన్ని చూడగానే ఏదో ఆపత్తు సంభవించి ఉంటుందని తంత్రవహి గ్రహించాడు రాజుగారివంక సాభిప్రాయంగా చూశాడు.

'ఆ గదిలోకి వెళ్ళి కూర్చుందాం రండి,' మహారాజు

అన్నాడు. ఇద్దరూ ప్రక్కనే ఉన్న మరో గదిలోకి వెళ్ళారు. మళ్ళీ అలజడి బయట ఆరంభమైంది.

ఇంతలోనే పడవ మనిషిని వెంటపెట్టుకుని ఆ సేవకుడు మహారాజు దగ్గరకు వచ్చాడు. ఆ మనిషిని చూడగానే మహారాజు ప్రశ్నించాడు:

'ఏం జరిగింది? నీకు తెలిసినంతవరకు వివరంగా చెప్పు.'

పడవ నడిపే మనిషి తనకు తెలిసిన విషయాలన్నీ పూస గుచ్చినట్టు వివరంగా చెప్పాడు.

రాజకుమారులు బోటుమీద నదిలో షికారు బయలుదేరడం, చాలాదూరం వెళ్ళిం తర్వాత అడవిలోంచి సంగీతం వినిపించడం, ఇద్దరూ అక్కడికి వెళ్ళడం వగైరా విషయాలన్నీ వివరంగా వినిపించాడు పడవ మనిషి.

మహారాజుకేం తోచలేదు. ఆ మనిషిని వెళ్ళ పొమ్మని తంత్రవహి వంక చూశాడు. తంత్రవహి వెంటనే లేచి బయటికి నడిచాడు. వెనుకనే మహారాజు బయలు దేరాడు.

తంత్రవహి అనేక విషయాలు దర్యాప్తు చేయగా రాత్రి ఓ ముసలి వ్యాపారి రాజకుమారుల్ని కలుసుకున్నట్టు సేవకుడి ద్వారా తెలిసింది.

'అతనెవరో మోసకారి అయుండాలి. లేకపోతే మనకు తెలియకుండా రాత్రి సమయంలో రాజకుమారుల్ని కల్సుకోడానికి ఎందుకు ప్రయత్నించాడు?' తంత్రవహి రాజుతో అన్నాడు.

'ఔను, మీరన్నది నిజమే. ఆ వ్యాపారి నన్ను కూడా కల్సుకొన్నానని సేవకుడితో అన్నాడని తెలుస్తోంది. అదీ అబద్ధమే. నన్ను ఎవరూ కల్సుకోలేదు,' మహారాజు కోపంగా అన్నాడు.

'ఆ వ్యాపారి రేపటి వరకు రాజభవనంలో ఉంటానని. తిరిగి రాజకుమారుల్ని రేపు ఉదయం కలుసుకుంటానని నాతో అన్నాడండి,' ఆ సేవకుడు విన్నవించాడు.

'వెంటనే ఆ వ్యాపారికోసం వెదకండి. రాజభవన మంతా గాలించండి. నేను నగరంలో అతన్ని వెదకడానికి తగిన ఏర్పాట్లు చేస్తాను,' అన్నాడు మహారాజు.

రాజభవనమంతా గాలించబడింది. పూదోటలన్నీ వెదికారు సేవకులు. దగ్గర్లో ఉన్న రక్షకభటులు బయలుదేరి నగరం లోని ముఖ్యస్థలాలన్నీ పరిశీలించారు. కాని ఎక్కడా ఆ వ్యాపారి జాడ లభించలేదు. అతనేమైందీ ఎవరికీ తెలియదు. ఎటునించి వచ్చాడో ఎటునించి వెళ్ళాడో ఎవరూ గమనించ లేదు.

'అతనెవరో మన పొరుగు రాజ్యాలనించి వచ్చిన గూఢ చారి అయి ఉండాలి,' మహారాజు అన్నాడు.

'ఏమో చెప్పలేం. మనకు మిత్రుడైనా కావచ్చు, శత్రు వైనా కావచ్చు. ఏది ఏమైనా ఇప్పుడు మనం ముందు రాజ కుమారుల కోసం వెదికించాలి. అందుకు తగిన ఏర్పాట్లు నేను చేస్తాను.' అంటూ తంత్రవహి రాజభవనంనించి వెలు పలికి వచ్చాడు.

రాజభవనం ముందు ఒక లైట్‌హౌస్ ఉంది. మెట్ల మీదుగా దాని మీదికి వెళ్ళాడు తంత్రవహి. పైన దీపానికి దగ్గరగా ఒక వాయిద్యం ఉంది. ప్రక్కనే ఉన్న కర్రతో దానిని వాయించాడు. ఆ ధ్వనికి సంబంధించిన వివరాలు ప్రజలకు తెలియకపోయినా సైన్యానికీ సైన్యాధిపతికీ తెలుసు.

అరగంటలో సైన్యాధిపతి విక్రమ్ కొంత సైన్యంతో రాజ భవనం ముందుకు వచ్చాడు. బారులు తీరి నిలబడిన సైన్యం

వంక ఆనందంగా చూస్తూ తంత్రవహి విక్రమ్‌తో ఇలా అన్నాడు.

'ఇప్పుడొక అవసరమైన పని మీద మిమ్మల్ని పిలిపించాను. రాజకుమారులకు సంబంధించిన వివరాలు మీరు వినే ఉంటారు. వాళ్ళు మాయమైన అడవి ఎంతో పెద్దదికాదు. దానిని ఓమూలనుంచి ఆరంభించి నరికి వెయ్యాలి. అప్పుడు మనకు రాజకుమారుల జాడ తెలియవచ్చు.'

మంత్రిమాటను ధిక్కరించగల శక్తి ఎవరికీ లేదు. అనేక ఆపదల నించి రాజ్యాన్ని కాపాడిన తంత్రవహి అంటే మహారాజుకు, రాజకుమారులకు ఎంతో గౌరవం.

తంత్రవహి మాట ప్రకారం సైన్యాధిపతి విక్రమ్ ఒక వెయ్యిమంది సైనికులతో ఆ అరణ్యంలోకి ప్రవేశించాడు. చెట్లు, తుప్పలు నరికి వేయడానికి సాధనాలు అందరికీ సమకూర్చబడ్డాయి. తెల్లవారే సరికి అడవి అంతా నరికి వేయమని విక్రమ్ సైనికులకు ఆజ్ఞాపించాడు.

ఆ ఆజ్ఞననుసరించి సైనికులు తమ పనిలో మునిగిపోయారు. తెల్లవారేసరికి అడవిలోని చెట్లు, తుప్పలు నరికి వేయబడ్డాయి. కొన్ని విషసర్పాలు జంతువులు చంపబడ్డాయి. కాని అరణ్యంలో ఎక్కడా ప్రతాప్ జాడ దొరకలేదు. ప్రతాప్‌ను వెదకటానికి వెళ్ళిన జయంత్ జాడ అంతకంటే లభించలేదు. అందరూ నిరాశ చెంది పోయారు.

అన్నిటికంటే ముఖ్య విషయం ఆ అడవిలో ఒక శవం దొరికింది. అది పురుషశవం. తల మాత్రం లేదు. ఒంటిమీద విలువైన దుస్తులున్నాయి. చేతిలో కత్తి ఉంది. అది ఎవరి శవమో గుర్తు పట్టడానికి ఏ మాత్రం వీలు కాకుండా ఉంది. ఆ శవాన్ని తీసుకుని సైనికులు, సర్వసైన్యాధిపతి నగరంలోకి ప్రవేశించారు.

ప్రతాప్ జయంత్‌ల జాడ తెలియలేదని వినగానే నరేంద్ర మహారాజా మరింత కంగారు పడ్డాడు.

ఇదంతా విచిత్రంగా ఉంది. అడవిలోకి వెళ్ళిన వాళ్ళు ఏమైపోయారో ఏమో! ఎవరైనా వాళ్ళను ఎత్తుకుపోవ డానికి ప్రయత్నించినా అంత తేలిగ్గా సాధ్య పడదు కదా! రాజకుమారులు మహావీరులు. ఎంత సైన్యాన్నైనా ఒం టరిగా ఎదుర్కోగల సమర్థులు' అంటూ మహారాజా తంత్ర వహి ముఖంకేసి చూశాడు.

'ఔను, అంతా విచిత్రంగానే ఉంది. ఇదంతా శత్రు రాజుల పన్నాగం కావచ్చు?' తంత్రవహి ఆలోచిస్తూ అన్నాడు.

కాసేపటివరకు ఎవరూ మాట్లాడలేదు.

'అడవిలో దొరికిన శవాన్ని ఒకసారి చూద్దాం. శవ భూషణాలను బట్టి ఆ వ్యక్తి ఎవరో ఎక్కడి వాడో తెలియ వచ్చు,' అన్నాడు తంత్రవహి చివరికి.

అడవిలో లభించిన శవాన్ని రాజుగారి ముందు హాజరు పెట్టవలసిందిగా విక్రమ్‌కు తెలియచేయబడింది. ఆ ఆజ్ఞను విక్రమ్‌కు అందచేయడానికి వెళ్లిన నౌకరు కాసేపటికి తిరిగి వచ్చి ఇలా అన్నాడు

'ఊళ్లోకి వచ్చేవరకు శవం సైనికులతో పాటే ఉందట. కాని ఇప్పుడది కనిపించడం లేదు. అందరూ వెదకుతున్నారు. అది ఏమైందీ తెలియదు.'

మహారాజా ఆశ్చర్యసంభ్రమాలతో అకస్మాత్తుగా లేచి నిలబడ్డాడు.

'నగరంలో ఇంతమంది మధ్య ఉన్న శవం ఎలా మాయ మైంది! ఇందులో ఏదో గూడుపుఠాణి ఉండి ఉండాలి.

ఇక ముందు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం వచ్చింది,' అన్నాడు మహారాజు.

తంత్రవహి ఆశ్చర్యానికి కూడా అంతులేదు. రాజకుమారులు మాయం కావడం, ముసలి వ్యాపారి జాడ తెలియకపోవడం, ఇంతమంది మధ్య ఉన్న శవం అంతు లేకుండా పోవడం సాధారణ విషయాలు కాదు. ఇన్నాళ్లు తామేదో సుఖంగా కాలుమీద కాలం వేసుకు కాలం గడిపారు. ఇప్పుడు జాగ్రత్త పడవలసిన సమయం వచ్చింది.

'ఇంతకీ ఇప్పుడు మన కర్తవ్యం?' మహారాజు తంత్రవహిని అడిగాడు.

'గూఢచారి దళాధిపతి మంత్రవాదితో మాట్లాడతాను. మనగూఢచారుల్ని అన్ని దేశాలకు అన్ని ప్రాంతాలకు పంపి రాజకుమారుల ఆచోకీ తీయిస్తాను.' అన్నాడు మహామంత్రి.

## 3

ప్రతాప్ ఏమైపోయాడో అన్న చింతతో వెదకడానికి బయలుదేరిన జయంత్ తిన్నగా ఆచెట్టు దగ్గరకువచ్చాడు. అక్కడినించి అడవిలో వెదకుతూ అటూ ఇటూ తిరగ సాగాడు. కాని ఎంత సేపటికి అతనికెవరూ కనిపించలేదు.

చాలాదూరం వెళ్ళగా అక్కడ అతనికొక పురుషశవం కనిపించింది. ఆ శవానికి తల లేదు. అందమైన దుస్తులున్నాయి. చేతిలో ఖడ్గం ఉంది. ఎవరిదో ఈ శవం అనుకున్నాడు జయంత్. ఈ అడవిలోకి తామిద్దరు అన్నదమ్ములు తప్ప మరెవరూ పురుషులు ప్రవేశించలేదే అని అతని సందేహం. విశే. ఆ దుస్తుల్ని, అలంకారాలని బట్టి ఆశవం తమకు సంబంధించింది కాదని జయంత్ నిర్ణయించుకొన్నాడు.

ఈ శవాన్ని బట్టి ఇంతకు క్రితం ఈ ప్రాంతాల్లో ఎవరో సంచరించి ఉండాలని జయంత్ భావించాడు. శవాన్ని ఓ ప్రక్కకు పెట్టి ముందుకు సాగాడు.

ఆకస్మాత్తుగా అతనిదృష్టి గుఱ్ఱం మీద ప్రయాణం చేస్తున్న ఓ యువతిమీద పడింది. వెంటనే జయంత్ ఆ ప్రక్కకు పరుగుతీశాడు. ముందు గుఱ్ఱం మీద యువతి, వెనక జయంత్ కొంతదూరం వెళ్ళారు.

ఒక ఫర్లాంగ్ దూరంలో చిన్న కొండ కనిపించింది. ఆ కొండకు సమీపంగా వెళ్ళింతర్వాత ఆ యువతి వేగం హెచ్చించింది. గుఱ్ఱం నాలుగు కాళ్ళమీద పరుగిడ సాగింది. జయంత్ వెనకే వేగంగానే పరుగెత్త సాగాడు. వినా గుఱ్ఱం కొండ చాటునించి పరుగెత్తి చూపు కందకుండా పోయింది.

జయంత్ కొండను సమీపించాడు. జరిగిన విషయాలన్నీ తల్చుకొంటూంటే అతనిలో ఆవేశం ఎక్కువౌతోంది. అడవి మధ్యలో చేరి పాటలు పాడిన స్త్రీ లెవరు? ప్రతాప్ ఏమైనట్టు? శవం ఎవరిది? కనిపించకుండా పారి పోయిన ఈ యువతి ఎవరు? ఈ విషయాలన్నీ తెలుసుకో వాలనిపించింది జయంత్ కు.

కొండ అంత ఎత్తుగా లేదు. దానిమీదకు ఎక్కితే గుఱ్ఱం ఎటు పోతున్నా కనిపించవచ్చు అనుకున్నాడు. గబగబా కొండ కొసకు ఎక్కి నాలుగు వైపులా పరికించి చూశాడు. ఎక్కడా అతనికి గుఱ్ఱంమీద పారిపోతున్న యువతి కనిపించ లేదు. ఆ గుఱ్ఱం ఎటుపోయినట్టో, ఏమైనట్టో!

జయంత్ దృష్టి కుడిచేతివైపుకు ప్రసరించింది. ఆ వైపు ఇంకా అడవి ఎక్కువ దూరంలేదు. తను చాలాదూరం వచ్చే శాడన్న మాట. దూరంగా ఓ చిన్న దీపం మిణుకు మిణుకు

మంటూ జయంత్‌కు కనిపించింది. అక్కడ ఎవరైనా ఉండి ఉండాలి! ఎవరో చూడాలి. ఏది ఏమైనా ప్రతాప్ లేకుండా తాను ఒంటరిగా ఇంటికి తిరిగి వెళ్ళకూడదు అని జయంత్ నిర్ణయించుకున్నాడు.

కొండ దిగి కుడిచేతి వైపుగా దీపం కనిపించిన వైపు ముందుకు సాగాడు. ఎక్కువ దూరం వెళ్ళకుండానే అతనికి ఒక గుడిసె కనిపించింది. ఆ గుడిసె ముందు చిన్నదీపం మిణుకు మిణుకు మంటూ వెలుగుతోంది. జయంత్ నాలుగు వైపులా చూశాడు. ఓ ప్రక్కగా ఉన్న చెట్టుకింద నలుగురైదుగురు మనుషులు గాఢనిద్రలో ఉన్నారు.

జయంత్ అందులో ఒక మనిషిని నిద్రలేపాడు. అతనితో పాటు నలుగురూ లేచి కూర్చున్నారు. ఒక్కసారి కళ్ళు నులుముకుని జయంత్ వంకవాళ్ళంతా ఆశ్చర్యంగా చూశారు.

'రాజకుమారులు! ఇటు ఎందుకు దయచేశారో; అడగవచ్చునా?' అందులో ఒకతను ఆశ్చర్యంగా అన్నాడు.

జయంత్‌కు వాళ్ళెవరో తెలియదు. కాని వాళ్ళు తనను గుర్తుపట్టడంలో ఆశ్చర్యంలేదు. వాళ్ళడిగిన ప్రశ్నకు జవాబు మాత్రం చెప్పలేదు. చాలా సేపటినుంచి అడవిలో అటూ ఇటూ తిరుగుతూండడం వల్ల చాలా దాహంగా ఉంది.

జయంత్ మౌనంగా ఉండటం చూసి వాళ్ళే తిరిగి అన్నారు.

'రాజకుమారులు అలసినట్టున్నారు. విశ్రాంతి తీసుకోండి. మేం ఇచ్చే ఫలాలు భుజించి పానీయం సేవించి మమ్మల్ని కృతార్థుల్ని చేయండి.'

అందులో ఒకతను వెంటనే గుడిసెలోకి వెళ్ళాడు. జయంత్ ఆ ప్రక్కకు చూశాడు. ప్రతాప్‌జాడ కనుక్కునేంత వరకు తాను విశ్రమించడం కల్ల.

'ఇంతకు క్రితం ఇటు ఎవరైనా ఆడవాళ్ళు గాని మగ వాళ్లు గాని వెళ్ళడం మీరు చూశారా?' జయంత్ అడిగాడు.

'ఎవరూ కనిపించ లేదండి,' వాళ్ళు ముక్తసరిగా జవాబిచ్చారు. జయంత్ ఏంచెయ్యాలో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

గుడిసెలోకి వెళ్ళినమనిషి కొన్ని మామిడిపళ్ళు, మంచినీళ్లు తీసుకు వచ్చి జయంత్ ముందుంచాడు. జయంత్ పళ్ళను ముట్టుకోలేదు. ఆత్రంగా మంచినీళ్ళను తనివితీరా తాగేశాడు.

'ఒక్కక్షణం ఇక్కడ కూర్చుని వెళ్లండి,' అందులో ఒకతను అన్నాడు.

జయంత్ బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు. కాసేపు అక్కడ కూర్చోవాలనిపించిందతనికి. చెట్టు కింద వాళ్ళిచ్చిన దిళ్ళ కానుకుని కూర్చున్నాడు. అంతే. ఏదో మత్తు అతని శరీరమంతటా వ్యాపించింది. కళ్లు మూతలు పడ్డాయి. స్పృహ తప్పి నేలమీద పడిపోయాడు.

మరునాడు జయంత్ కు తెలివి వచ్చేసరికి అతనొక చక్కగా అలంకరింపబడిన గదిలో పరుపు మీద పడి ఉన్నాడు. లేచి నిలబడి కళ్లు నులుముకుని అటూ ఇటూ చూశాడు. ఆ గదికి ఎక్కడా తలుపులు లేవు. ఒక ప్రక్క పెద్దకిటికీ మాత్రం ఒకటుంది. ఇదంతా జయంత్ కేమీ అర్థం కాలేదు. ఆశ్చర్యంగా నాలుగు ప్రక్కలా చూస్తూ మళ్ళీ ప్రక్కమీద కూర్చున్నాడు.

ఇంతలో నలుగురైదుగురు యువతులు ఆ గదిలోకి వచ్చారు. అందరూ చక్కగానే ఉన్నారు. అందరిలోకి ముందున్న యువతి మాత్రం ఎంతో అందంగా ఉంది. ఆమె

అందచందాలకు ఎవరైనాసరే లొంగి పోవలసిందే. జయంత్ కళ్లార్పకుండా ఒక్కనిమిషం ఆయువతి కేసి చూశాడు.

'ఏమిటలా చూస్తున్నారు? నన్ను మింగేస్తారా ఏం? మీ రెంత బలవంతులైనా నా దగ్గర ఆ బలం పనికిరాదు లెండి.' ఆ ముందున్న యువతి అన్నది.

'ఎవరు నువ్వు? నన్నిక్కడికి ఎందుకు తీసుకు వచ్చారు?' జయంత్ మనస్సులో ఆ యువతి అందచందాలను ఎంచుకుంటూనే పైకి గంభీరంగా ప్రశ్నించాడు.

'మీరు నన్ను ప్రేమించగలరా?' ఆ యువతి ఎదురు ప్రశ్నించింది. జయంత్ ప్రశ్నకు జవాబివ్వలేదు.

జయంత్ ఆ యువతి ప్రశ్నకు నివ్వెర పోయాడు. ప్రపంచంలోని సౌందర్యం ఆ యువతి రూపంలో తన ముందుకు వచ్చి వాలిందా అని ఆశ్చర్యపోతున్న జయంత్ ఒక్కక్షణం ఆలోచించాడు. తాను ఆ యువతి ఎవరో తెలుసుకోకుండా ఆమె వలలో చిక్కితే మంచిదికాదు. తనని క్కడికి మోసం చేసి తెప్పించిన ఆయువతి పైకి ఎంత అందమైందయినా అస లెంత చెడ్డదో!

'నీలాంటి అందమైన యువతిని తిరస్కరించగలవాళ్లె వరుంటారు.' జయంత్ పరధ్యానంగా అన్నట్టుగా అన్నాడు.

ఆ యువతి జయంత్ ప్రక్కనే కూర్చుని అతని తల నిమురుతూ 'నేను మిమ్మల్ని సంవత్సరం నించి ప్రేమిస్తున్నాను. కాని మిమ్మల్ని పొందగల అవకాశం నాకు లభించలేదు. ఈ నాడు నా కోరిక తీరింది,' అన్నది.

జయంత్ కొంచెం ఎడంగా జరిగాడు.

'కాని నువ్వు నిజంగా నన్ను ప్రేమించి ఉంటే ఈ విధంగా పొందడానికి ప్రయత్నించడం అభిలషణీయంకాదు.

మోసం చేసి నన్ను ఇక్కడికి తెప్పించడం నీచులు చేయ వలసిన పని. నిన్ను కూడా నేను అలాగే ఎంచుతున్నాను. సరైన పద్ధతిలో ప్రేమను నాకు తెలియపరచి ఉంటే నీలాంటి అందకత్తెను నేను తప్పకుండా ప్రేమించి ఉండే వాడిని,' జయంత్ అన్నాడు.

'నన్ను గురించి మీరు ఎలా అనుకున్నా నాకు బాధలేదు. ఇప్పుడు మీరు నా చేతికి చిక్కారు. తప్పించుకు పారిపో లేరు. మిమ్మల్ని వదలి నేను ఉండలేను.'

'నా మీద మాత్రం నువ్వు ఆశ పెట్టుకోనక్కరలేదు. నేను నిన్ను ప్రేమించడం కల్ల.'

'మీరు హృదయపూర్వకంగా ఈమాట చెబుతున్నారా?'

'ఔను'

'ఇలా చేస్తే మీరు చాలా బాధలు పడవలసి వస్తుంది. మీరు ఇక్కడినించి ఎలాగూ తప్పించుకు పారిపోలేరు. పైగా నా అంత అందగత్తె మరొకతె మీకు లభించడం దుర్లభం.'

'నేను కేవలం అందాన్ని మాత్రమే చూసి లొంగిపోయే వాడిని కాను. మంచితనం కూడా నేను చూస్తాను. నీలాంటి నీచుల్ని ప్రేమించి నేను సుఖపడేదేమీ ఉండదు.

'ఐతే మీరు ఇక్కడ ఉండదల్చుకోలేదన్నమాట.'

'లేదు.'

'సరే వెళ్లండి. ఎలా వెళ్తారో చూస్తాను!'

జయంత్ ఎక్కడైనా తలుపు ఉందేమోనని మళ్లీ గదికి నాలుగు వైపులా చూశాడు. ఇదే సమయంలో ఆ యువ తులు కిటికీగుండా అవతలికి వెళ్ళిపోయి కిటికీ మూసేశారు. ఆ వైపు నించి ఏదో వికటాట్టహాసం జయంత్‌కు వినిపిం

చింది. ఎలాగైనా సరే అక్కడినించి తప్పించుకు పోవాలని జయంత్ అనుకున్నాడు కాని ఎలాతప్పించుకోగలడు! తప్పించుకోడానికి మార్గం కనిపించడంలేదు. జయంత్ కిటికీదగ్గరకు వెళ్లి దాన్ని నెట్టడానికి ప్రయత్నించాడు. కాని అది తెరచుకోలేదు. అవతలి ప్రక్కగడియ వేయబడి ఉందని జయంత్ గ్రహించాడు. నిరాశగా తిరిగి వచ్చి మళ్ళీ ప్రక్కమీద కూర్చున్నాడు.

ఆ పూటంతా అతనికి ఆహారం లేదు. మంచి నీళ్లు కూడా లేవు. క్రితం రోజు జరిగిన సంఘటనలన్నీ మనస్సులో మెదిలాయి. ప్రతాప్ ఏమైంది తెలీదు. తానిక్కడ బందీ అనాడు. ప్రతాప్‌ను కూడా వీళ్లే బంధించి ఉండవచ్చు. నిన్న రాత్రి తనకు మంచి నీళ్ళిచ్చి మోసంగించిందెవరో! నగరంలో తండ్రి మంత్రులు ఎంత కంగారు పడుతున్నారో-ఇలా జరుగుతుందని తాము కలలో కూడా ఎన్నడూ ఊహించి ఉండలేదు.

క్రమంగా చీకటి పడింది. గది నిండా చీకటి అలుముకొంది. ఒంటరిగా ఆ గదిలో ఆహారం నీరు లేకుండా ఎలా గడపడమా అని జయంత్ ఆలోచించసాగాడు. ఇంతలో మళ్ళీ ఆ కిటికీ తెరచుకుంది. అందులోంచి అదే యువతి మిగిలిన వాళ్ళతో కూడా ఈ గదిలోకి వచ్చింది.

ఆ యువతి ఎడమ చేతిలో ఒక దీపం ఉంది. కుడిచేతిలో ఒక పళ్ళెం ఉంది. దానిలో రకరకాల తినుబండారాలున్నాయి. గదిలోకి రాగానే ఆ యువతి పళ్ళాన్ని ప్రక్క మీద ఉంచి దీపం నేల మీద పెట్టింది.

ఏం చెయ్యడానికి తోచకుండా ఉన్న జయంత్ గబగబా ఆ యువతులు వచ్చిన కిటికీ గుండా అవతలి గదిలోకి వెళ్లాడు. కాని వాళ్ళు అడ్డగించలేదు. ఆ గదిలో బాగా చీకటిగా ఉంది. చేతుల్తో తడుముతూ వెదకగా జయంత్‌కు ఆ గదిలో

ఒక తలుపు కనిపించింది. కాని అది అవతలి వైపున వేయబడి నట్టుంది.

జయంత్‌కు తప్పించుకు పోవడానికి ఎట్టి అవకాశమూ లభించలేదు. తప్పని సరై మళ్ళీ ఆ కిటికీ గుండా తన గదిలోకి తిరిగి వచ్చాడు. నిరాశతో తిరిగి వచ్చిన జయంత్‌ను చూసి ఆ యువతి హేళనగా నవ్వింది.

'ఇక్కడినించి తప్పించుకు పారిపోవడం మీకు సాధ్యం కాదని నేను ముందే చెప్పాను. నామాట మీరు విన్నారు కారు. మళ్ళీ ఇంకోసారి మీరు ఆలోచించండి. నా ప్రేమను తిరస్కరించడం మీకు శ్రేయస్కరం కాదు.'

'ఈ కబుర్లన్నీ నాకు చెప్పనక్కర లేదు. నన్ను వదులు తావా లేక మిమ్మలందర్నీ నరికి వెయ్యమన్నావా?' జయంత్ గర్జించాడు.

'మమ్మల్ని నరికినా నాకిష్టమే కాని నేను మిమ్మల్ని మాత్రం వదలను,' ఆ యువతి ధీమాగా అన్నది.

మాటయితే అన్నాడు కాని ఆడవాళ్ళ మీద చెయ్యి చేసుకోవడం వీరులకు తగిన పని కాదని జయంత్ భావించి మౌనం వహించాడు.

'సరే, నా సంగతి అలా ఉంచండి. పాపం పగలంతా నాకు ఆహారం లేదు. ఈ ఫలహారం స్వీకరించండి. మంచి నీరు త్రాగండి,' యువతి అన్నది.

జయంత్‌కు బాగా ఆకలివేస్తోంది. అతని దృష్టి తిను పదార్థాలున్న పళ్లెం మీద పడింది. కాని వెంటనే అతనికో ఆలోచన తట్టింది. నిన్న రాత్రి మంచి నీళ్ళు తాగితే తనకీ స్థితి సంభవించింది. అందులో ఏదో మత్తుమందు కలిపి ఉంటారు. అలాగే ఈ పదార్థాలల్లో కూడా ఏమైనా కలిపి ఉండ వచ్చు. తనకు స్పృహతప్పినప్పుడు వీళ్ళేఅఘాయిత్యం చేస్తారో!

'నువ్వు ముట్టుకొన్న ఫలహారం నేను తీసుకోను,' జయంత్ నెమ్మదిగా అన్నాడు.

'మీరు అనవసరంగా పంతం పడుతున్నారు. ఆహారం లేకుండా మీరు ఎన్నాళ్ళని ఉండగలరు! చివరికి మీరు నాకు లొంగి పోక తప్పదు. తర్వాత పశ్చాత్తాప పడి లాభం లేదు.'

జయంత్ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండి పోయాడు.

'ఈ ఆహారం జలం ఇక్కడే వదలి వెళ్తాం. ఆకలివేసి నప్పుడు ఆరగించండి,' అంటూ ఆ యువతి కిటికీకేసి నడిచింది. మిగిలిన వాళ్ళు ఆమె ననుసరించారు.

వాళ్ళు వెళ్ళి పోతుండగా తనూ అదే కిటికీ గుండా బల వంతాన వెళ్ళిపోవాలని జయంత్ నిర్ణయించుకున్నాడు. వాళ్ల వెనకే అతనుకూడా కిటికీ దగ్గరకు వెళ్ళాడు. తనను రానివ్వక పోతే వాళ్లనుకూడా తను వెళ్ళనియ్యకుండా చెయ్యాలని అతననుకున్నాడు.

మిగిలిన నలుగురూ వెళ్లిపోయిం తర్వాత ఆ యువతి కిటికీ లోనించి అవతలి వైపుకు ఒక కాలు వేసి నిలబడింది. జయంత్ ఆమె ముందే కిటికీలో ప్రవేశించడానికి సిద్ధంగా నిలబడ్డాడు.

ఆ యువతి ముందున్న గదిలోకి తీవ్రంగా చూసింది.

'నువ్విక్కడికెందుకొచ్చావ్?' ఆమె కోపంగా బిగ్గరగా అరచింది.

ఎవరా ఆ మనిషి అని జయంత్ ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు. కాని అక్కడ ఎవరూలేరు. జయంత్ మళ్ళీ ముందుకు చూసే సరికి ఆ యువతి అక్కడలేదు. కిటికీ మూసి ఉంది. వెనక నించి మళ్ళీ వికటాట్టహాసం వినిపించింది.

తను మళ్ళీ మోసపోయాడు. ఆ యువతి టక్కులాడి అని తెలిసి కూడా తను మళ్లీ అజాగ్రత్తగా ప్రవర్తించాడు. ఇంత అజాగ్రత్తగా ప్రవర్తించడం వల్లే తమకిన్ని కష్టాలు కలిగాయి. ఇకముందు ఎంతో జాగ్రత్తగా ఉండాలని జయంత్ మనస్సులో అనుకున్నాడు. వెళ్ళి తన ప్రక్కమీద కూర్చున్నాడు. ప్రక్కనే ఫలహారాల పళ్ళెం ఉంది. కాని వాటిలో విషం కలిపారేమో ఎవరికి తెలుసు?

ఒక ప్రక్క ఆకలి దహించుకు పోతోంది. వినా తాను చేయగలిగిందేమీ లేదు. బయటికి వెళ్ళడానికి మార్గం తనకు తెలియదు. ఏమీతోచని స్థితిలో జయంత్ లేచి గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

అకస్మాత్తుగా ఆ కిటికీ తెరచుకుంది. అందులోంచి ఒక యువతి గదిలోకి వచ్చింది.

'పాపం మనస్సు పట్టలేక అడవిలో జరుగుతున్నదేమో తెలుసుకుందామని బయలుదేరి ఈస్థితికి వచ్చారు. మీరీ ఇంట్లోకివచ్చి ఎన్నాళ్ళైందో? నేను మీకు శత్రువును కాను, నామాట నమ్మండి,' అయువతిఅన్నది. ఆ యువతిని ఇదివరకు క్రితం జయంత్ ఎక్కడాచూసినట్టు లేదు.

'నువ్వెవరివి? ఇక్కడికెందుకొచ్చావ్?' జయంత్ ప్రశ్నించాడు.

'నేనీఇంట్లోకి ఏదో పని మీద ప్రవేశించాను. అకస్మాత్తుగా మీరిక్కడ నాకు కనిపించారు. దేవుడు చేసే ప్రతి పనీ నిజంగా మన మేలుకే. ఇప్పుడు మనమిద్దరం ఒకరికొకరం సహాయం చేసుకోవచ్చు.'

'ఎలా?'

'నేను మిమ్మల్ని ఈ యింట్లోంచి విడిపించగలను.'

'నిజమా?

'ఔను. కాని అందుకు నాకు ప్రతిఫలం కావలసి ఉంది.'

జయంత్ ఒకక్షణం ఆలోచించాడు.

'నువ్వుకూడా ఆ యువతుల బృందంలో చేరిన దానివికాదు కదా అని నాకు అనుమానంగా ఉంది,' జయంత్ అన్నాడు.

ఆ యువతి చిరునవ్వు నవ్వింది.

'మీరు నన్ను శత్రువుగా భావించ వక్కరలేదు. ముందు మీకు ఆహారం తెచ్చిస్తాను ఆరగించండి. ఏమీ భయపడ నవసరం లేదు. తర్వాత మనం మాట్లాడుకుందాం.'

ఆ యువతి వచ్చినదారినే వెళ్ళిపోయింది. జయంత్ జరుగుతున్న విచిత్ర ఘటనల్ని గురించి ఆలోచిస్తూ ప్రక్క మీద కూర్చుండి పోయాడు.

పది నిమిషాలలో ఆ యువతి కొన్నిపళ్ల నీళ్ళు తీసుకువచ్చి జయంత్ కిచ్చింది. ఆకలితో కొట్టుకుపోతున్న జయంత్ మరేమీ అనుమానించకుండా పళ్లు తిని మంచినీళ్లు తాగే శాడు.

'ఇప్పుడిక్కడికెవరూ రారుకదా!' ఆకలి తీరింతర్వాత జయంత్ ఆ యువతిని అడిగాడు.

'ఎవరూరారు. అసలెవరూ ఈ ఇంట్లో లేరుకూడా. ఎక్కడికో బయటికి వెళ్ళిపోయారు. మనం నిశ్చింతగా మాట్లాడు కోవచ్చు.'

'మరి నన్ను తప్పకుండా ఈ ఇంట్లోంచి విడిపించ గలవా?'

'విడిపించగలను. కాని అందుకిది సమయం కాదు. మిమ్మల్ని విడిపించినందుకు మీరు నాకు బహుమతి ఇవ్వాలి.'

'ఏం కావాలో అడుగు.'

'మీ దగ్గరనించి నాకేమీ అక్కర్లేదు. కాని మిమ్మల్ని ప్రేమించిన ఆ యువతి మెడలోఉన్న రత్నాల హారం నాకు కావాలి.'

'నాదగ్గర ఉన్న వస్తువులేమన్నా ఐతే నీకివ్వగలను కాని ఆ యువతి మెడలో రత్నాలహారం నేను నీ కెలా ఇవ్వగలను?'

యువతి మళ్ళీ నవ్వింది.

'మీరింత అమాయకులు కాబట్టే వీళ్ళ చేతిలో చిక్కారు. మిమ్మల్ని ఈ యువతి ఎంతగానో ప్రేమిస్తోంది. మీరు పెళ్ళి చేసుకుంటానంటే మీరు కోరిందేమైనా ఆమె మీ కివ్వగలదు. రేపు ఉదయం ఎలాగో మీ దగ్గరకు వస్తుంది. మీరామెను ప్రేమిస్తున్నట్టు నటించండి. ఆమె మెడలో ఉన్న హారాలన్నీ ఇస్తే పెళ్ళి చేసుకోడానికి అంగీకరిస్తానని చెప్పండి.'

'నేను కోరినవన్నీ తప్పకుండా ఇస్తుందంటావా?' జయంత్ అనుమానంగా అడిగాడు.

'మీకోసం ప్రాణమైనా ఇస్తుంది. పైగా ఆమెదృష్టిలో ఈ రత్నాలహారం లెక్కలోదికాదు. ఆమెకు చాలా డబ్బున్నది. ఈ విషయంలో మీరేమాత్రం సందేహించనక్కర లేదు. పైగా వాళ్ళను మోసగించి కిటికీగుండాగాని మరే దారినైనాగాని మీరు తప్పించుకోవడం అసంభవం. మీరు నాకా రత్నాలహారం ఇప్పిస్తే నేను మిమ్మల్ని తప్పకుండా ఈ ఇంట్లోంచి విడిపించగలను.'

'సరే. నీకా హారం ఇప్పిస్తా,' అన్నాడు జయంత్.

ఆ యువతి మరోసారి చిరునవ్వు నవ్వింది. ఎంతో ఆనందంగా జయంత్ వంక చూస్తూ 'మర్చిపోకండి,' అని మళ్ళీ కిటికీగుండా వెళ్ళిపోయింది.

ఆకాశం నిండా దట్టంగా మబ్బులు ఆవరించాయి. వర్షం కురిసే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చల్లటిగాలి విపరీతంగా వీస్తోంది. ఆ గాలికి చెట్లకొమ్మలు ఊగిపోతూ ఒకదానితో ఒకటి ఒరుసుకొంటున్నాయి.

దట్టంగా ఉన్న ఆ చెట్లమధ్యగా నాలుగు ప్రక్కలా నాలుగు ఎత్తైన కొండలున్నాయి. ఆ కొండలమధ్య రమణీయమైన విశాల ప్రదేశం ఉంది. ఆ ప్రదేశంలోకూడా చెట్లు ఎక్కువగానే ఉన్నాయి. ప్రకృతి సౌందర్యానికి తావు నెలవు. అరవిచ్చిన పూలు సుగంధాన్ని నలుదిక్కులా వెద జల్లుతున్నాయి. చెట్లమధ్యగా నాలుగు వైపులా నాలుగు పెద్ద కొసారాలున్నాయి. అందులో కలువపూలు, తామరపూలు సైతం ఉన్నాయి. ఆ కొసారాలలోకి కొండల మీదనించి సెలయేళ్ళు నీటిని చేరవేస్తున్నాయి.

ఈ నాలుగు కొసారాలకు మధ్యగా ఒక భవనంఉంది. పైకి చూడడానికి చాలా చిన్నదిగా కనిపించినా దాని లోపల చాలా గదులున్నాయి. ఇది ప్రాచీన భవనమే. బలమైన కొండరాళ్ళతో తయారు చేయబడింది. భవనానికి ముందు చక్కని తోటఉంది. ఆ తోటలో సువాసనలు వెదజల్లే పూలమొక్కలు మాత్రమే ఉన్నాయి.

భవనంలో ఎక్కువమంది జనంలేరు. పదిహేనుమంది అందమైన ఆడవాళ్ళు మాత్రం అప్పుడప్పుడూ కనిపిస్తూ ఉంటారు. రమణీయమైన ఆ ప్రదేశంలో వాళ్ళందరూ ఆహ్లా దంగా జీవితాలు గడపుతున్నారు. తినడానికి తిండి, తిరగ డానికి చక్కనిచోటు ఉన్నాయి. మనస్సుకు, హృదయానికి ప్రశాంతతను, హాయిని చేకూర్చగల ఆ ప్రదేశంలో ఇంకా వేరే కావలసిందేముంది!

భవనానికి వెలుపలగా ఓ కాసారానికి సమీపాన ప్రతాప్ ఒక అందమైన యువతితో పాటు పెద్ద రాతిబండమీద కూర్చుని ఉన్నాడు. ఇద్దరూ ఆ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులై మైమరచినట్టు కనిపిస్తున్నారు. ఆ యువతి ప్రతాప్‌ను ఆనుకుని కూర్చుంది. వేషాన్నిబట్టి ఏ రాజకుమార్తో ఐ ఉంటుందనిపిస్తోంది.

ప్రతాప్ ప్రక్కనే కూర్చున్న యువతివంక ఓసారి చూశాడు.

'నిజం చెప్పు మంజులా! ఇంకా నా అనుమానం తీరలేదు. గోదావరి ఒడ్డున అడవిలో రాతిమీద కుర్చున్నది నువ్వా కాదా?'

'నేనే నని మీకెన్నోసార్లు చెప్పాను. ఐనా మీరింకా నన్ను అడుగుతూనే ఉన్నారు. ప్రమాణం చేసి చెబుతున్నాను. నేనే ఆ రోజు అడవిలో మీకు కనిపించింది,' మంజుల అన్నది.

ప్రతాప్ తనచేతి వ్రేలికి తగిలించివున్న ఉంగరం కేసి చూశాడు. అతని ముఖంలో ఏదో అసంతృప్తి కనిపించింది.

'మరి ఈ ఉంగరంలో ఫొటోకీ నీకూ భేదం కనిపిస్తోంది. పోలికల్లో తేడావుంది.' ప్రతాప్ అన్నాడు.

'ఆ బొమ్మ తయారుచేసిన మనిషి లోపం అది. బొమ్మకూ నాకూ కొద్ది భేదం ఉండి ఉంటుంది.'

ప్రతాప్ నిట్టూర్చాడు.

'ఏది ఏమైనా నువ్వుమాత్రం నన్ను వశపర్చుకున్నావు. ఇక్కడ బందిఖానాలో నన్ను బంధించావు. స్వేచ్ఛగా తిరగకుండా చేస్తున్నావు. మా ఇంటిదగ్గర నాన్నగారు, జయంత్ మొదలైన వాళ్ళు ఎంత కంగారు పడుతున్నారో ఏమో! ఒకసారి నేను మానగరం వెళ్తే—'

మధ్యలోనే మంజుల అన్నది.

'నన్ను కలుసుకోడానికి గోదావరీతీరాన్నుంచి అడవి మధ్య దాకా మీరేవచ్చారు. వచ్చి మా చేతుల్లో చిక్కారు. మేం అంత తేలిగ్గా మిమ్మల్ని వదలగలమా!'

'నిన్ను నేను ప్రేమిస్తున్నానని ఒప్పుకున్నాకదా! పెళ్ళి చేసుకోడానికి అంగీకరిస్తునన్నా కదా. ఐనప్పుడు నన్నిలా రహస్య స్థలంలో దాచి ఉంచడం దేనికి?'

మంజుల మాట్లాడలేదు. మౌనంగా ఎదురుగా ఉన్న కాసారం కేసి చూస్తోంది.

'మంజులా! నీవిషయాలు పూర్తిగా తెలియచేస్తానని ఎన్నో సార్లు వాగ్దానం చేశావు కాని ఇంతవరకు చెప్పలేదు. ఒక్క వాగ్దానాన్ని కూడా నువ్వు నిలబెట్టుకోలేదు. ఉన్న కొద్దీ నీ మీద నాకు నమ్మకం తొలగిపోతోంది. మరి ఈ రోజైనా నీ విషయాలు నాకు చెబుతావా?'

మంజుల కాసేపాలోచించింది.

'క్షమించండి. మీకంటే నాకు కావలసినవాళ్లు ప్రపంచంలో మరెవరూ లేరు. నా విషయాలు మీకు కాక నేను మరెవరికీ చెప్పను! ఐనా ఇప్పుడు మాత్రం చెప్పలేను. ఈ ఒక్క రోజూ ఓపికపట్టండి. రేపు సాయంకాలం నా వృత్తాంతమంతా మీకు తప్పక తెలియచేస్తాను.'

ప్రతాప్ మరింకేమీ అడగ లేదు. సరేనన్నట్టు తల ఊపాడు.

'సరే, సెలవు. రెండుగంటల్లో వస్తాను. మీరు విశ్రాంతి తీసుకోండి,' అంటూ మంజుల అక్కడినించి లేచి భవనం లోకి వెళ్ళిపోయింది.

ప్రతాప్ ఒంటరిగా అక్కడ కూర్చుండిపోయాడు. ఏమీ తోచడంలేదు. మంజుల ఎవరో, ఈ కోటకూ ఆమెకుగల

సంబంధమేమిటో, తన వృత్తాంతాన్ని ఎందుకు దాస్తున్నదో, సాయంకాలం రోజూ రెండుగంటలు ఎక్కడికి వెళ్తున్నదో, ప్రతాప్‌కు తెలియకుండావుంది. ఆమె ఏ దారిన వచ్చి ఏ దారిన వెళ్తున్నదో కూడా అతనికి తెలియదు.

మంజుల తనను ప్రేమిస్తున్నదని మాత్రం ప్రతాప్ నిర్ణయించుకున్నాడు. ఐతే ఆమె తననిక్కడ బందీగా ఎందుకు ఉంచిందో అతనికర్థంకావడం లేదు. ఆ ప్రదేశం ఎంత రమణీయంగా ఉన్నా ఎంత మనోహరమైనదయినా అక్కడ స్వేచ్ఛ లేకుండా ఉండడం ప్రతాప్‌కు కష్టమనిపిస్తోంది.

అక్కడినించి ఎలాగైనా తప్పించుకోవాలని ప్రతాప్ ప్రయత్నించాడు. కాని, బయటికి పోవడానికి అతనికి మార్గామేమీ కనిపించలేదు. చుట్టూ లోతైన కాసారాలు, ఆపైన ఎత్తయిన కొండలు కనిపిస్తున్నాయి. ప్రాణాలకు తెగించి తప్పించుకోడానికి సాహసించడం తద్వారా తాను ప్రేమిస్తున్న మంజుల మనస్సును కష్టపెట్టడం అతనికిష్టంలేదు.

ప్రతాప్ నెమ్మదిగా లేచాడు. రెండు గంటలసేపు ఎలాగో గడపాలి. అప్పటికిగాని మంజుల రాదు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ప్రతాప్ ముందుకు సాగాడు. ఇది వరకు తాను వెళ్ళని వైపుకు నడుస్తున్నాడు. ఒక ఫర్లాంగు దూరం వెళ్ళేసరికి కాసారంలో అతనికి ఒక చిన్న పడవ కనిపించింది. ఆ చుట్టుప్రక్కల ఎవరూ లేరు.

ప్రతాప్ పడవకేసి పరీక్షగా చూశాడు. కాసారానికి మధ్యగా ఉన్నది ఆ పడవ. దానిమీద ఎవరూలేరు. ఎవరూ లేకుండా ఆ పడవ కాసారంమధ్యలో ఎలావుందోఅతని కర్థం కాలేదు. ఒడ్డున నడుస్తూ పరీక్షగా చూదికాడు. ఒకమూల ఇనుపముక్క ఒకటి పాతివుంది. దానికి ఒక తాడు కట్టిఉంది. ఆతాడు కాసారంలోనికి ఉంది.

ప్రతాప్ ఆనందానికి అంతులేక పోయింది. చుట్టూ ఒక సారి కలయ చూసి ఎవరూ లేరని నిర్ణయించుకున్న తర్వాత ఆ తాడు పట్టుకొని నెమ్మదిగా లాగడం ప్రారంభించాడు. పడవ కదిలింది. క్రమంగా ఒడ్డుకు వచ్చేసింది.

ఇనుపముక్కకు తగిలించివున్న తాడును విప్పి ప్రతాప్ పడవమీద కూర్చున్నాడు. గాలి పాటున నడుస్తూ ఆ పడవ అవతలి ఒడ్డుకు చేరుకుంది. అందులోనించి దిగి ప్రతాప్ కొండప్రక్కకు చేరుకున్నాడు. కాసారాన్నయితే దాటగలిగాడు. కాని అంత ఎత్తయిన కొండను ఎలా దాటాలో అతనికి తోచడం లేదు.

కొండ ఎక్కకుండా బయటికి వెళ్ళడానికి ఏదయినా మార్గం ఉన్నదేమోనని ప్రతాప్ చుట్టుప్రక్కల వెదక సాగాడు. తన ప్రయత్నం అంతా మంజాల మళ్లీ తనకోసం వచ్చేలోపునే జరగాలి. ప్రతాప్ త్వరత్వరగా అటూఇటూ తిరుగుతూ వెదకసాగాడు. చివరికి అతనికి ఒక గుహ కనిపించింది. అది చీకటిమయంగా వుంది.

ప్రతాప్ గుహలోకి అడుగు పెట్టాడు. ఆ ఆ చీకటిలో దేనికీ తగలకుండా ముందుకు వెళ్లసాగాడు. కాని ఎంతదూరం వెళ్ళినా ఆ గుహకు అంతు అంటూ కనిపించకుండా వుంది.

కొంతదూరం వెళ్ళేసరికి ప్రతాప్‌కు ఏదో అడుగుల చప్పుడు వినిపించింది. అతను నిలుచున్న చోటనే ఆగి పోయాడు. చీకటిలో ఏదో ఆకారం తనవైపుకు వస్తున్నట్టు అస్పష్టంగా కనిపించింది. కాసేపటికి ఆ ఆకారం అతనిని సమీపించింది.

'ఈ గుహనించి తప్పించుకుపోవడం మీకు సాధ్యంకాని పని. తొందర పడకండి. తొందరపడి తప్పించుకోడానికి ప్రయత్నిస్తే మీకే అపాయం సంభవించవచ్చు. నా మాట విని వెనక్కి వెళ్లండి. నేను మీ మేలు కోరేమనిషిని.'

నెమ్మదిగా ఆ ఆకారం అనడం ప్రతాప్ విన్నాడు. అది స్త్రీ కంఠం. ఆ మనిషికి ఏం జావాబివ్వడానికీ ప్రతాప్ కు తోచలేదు.

ఆ ఆకారం మడచివున్న ఒక కాగితాన్ని ప్రతాప్ చేతి కిచ్చింది. ప్రతాప్ ఏదో అడగ బోతుండగా ఆమనిషి అన్నది.

'కాగితంలోని విషయాలు చదివితే మీకే తెలుస్తాయి నన్నేమీ అడగ నక్కరలేదు. మీరు ఇక్కడినించి వెంటనే వెళ్ళిపొండి. ఆలస్యం చేస్తే వాళ్ళు మీకోసం వెదకడం ఆరంభిస్తారు. మీరు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారని వాళ్లకు తెలిస్తే మరింత కష్టం. మీరు తొందర పడకండి. మిమ్మల్ని ఈ ప్రదేశం నించి విడిపించగల బాధ్యత నాది.'

ప్రతాప్ మారు మాటాడలేదు. ఆ ఆకారం ముందుకు సాగి క్రమంగా చీకటిలో కలిసి పోయింది. ప్రతాప్ వెనక్కి తిరిగాడు. ఆ కాగితంలోని విషయమేమిటో అతనికి వెంటనే చూడాలనిపించింది. కాసేపట్లో గుహలోంచి బయటపడ్డాడు.

ప్రతాప్ ఆ కాగితం మడత విప్పి వెలుగులో గబగబా చదివాడు.

శ్రీవారికి నమస్కారాలు,

మీకు సమర్పించబడిన ఉంగరంలోని చిత్రం రూపంలో నన్ను నేను మీకు సమర్పించుకొన్నాను. కాని మధ్యలో ఒక మాయలాడి నా వేషం వేసుకుని మిమ్మల్ని మోసగించి స్వగృహానికి తీసుకుపోయింది. నామాట నమ్మండి. మీ ఉంగరంలోని చిత్రం నాది. మంజులది కాదు.

ఈ ఉత్తరం చదవగానే చింపి వెయ్యండి.

మీ కిరణ్మయి.

ప్రతాప్ ఆశ్చర్యానికంతు లేకపోయింది. ఇంత విచిత్ర మైన సంఘటన జరుగుతుందని ఆశించలేదు. తాను నిజంగా ప్రేమించింది కిరణ్మయినన్నమాట. మంజుల కిరణ్మయి రూపంలో తనను మోసగించి ఉంటుంది. ఈ మోసకారి నెలాగైనా సరే మోసగించి తప్పించుకు పారిపోవాలి. కాని రేపు తన వృత్తాంతమంతా చెబుతానన్నది మంజుల. అప్పటి వరకు రహస్యాన్ని వెల్లడించకుండా ఆమెతో ఎట్టి తగాదా పెట్టుకోకుండా వృత్తాంతమంతా తెలుసుకోవాలి. ఈ ఉత్తరాన్నిబట్టిచూస్తే ఎవరో తనని విడిపించడానికి ఇప్పటికే ప్రయత్నిస్తున్నారన్నమాట.

మంజుల రాకముందే యథాస్థానంలోకి వెళ్ళిపోవాలనే ఉద్దేశ్యంతో ప్రతాప్ పడవమీదికి ఎక్కాడు. ఎదురుగాలి కావడంచేత పడవ ఎంత త్రోసినా కదలడంలేదు. తెడ్లు వేస్తుంటే మెల్లిగా నడుస్తోంది. తెడ్లు వేస్తూ ప్రతాప్ కిరణ్మయిని గురించి ఆలోచించసాగాడు.

## 5

రాత్రంతా జయంత్‌కు నిద్ర పట్టలేదు. తనకు సహాయం చేయడానికి వచ్చిన స్త్రీని గురించి, ఆ స్త్రీకి కావలసిన రత్నాల హారంగురించి ఆ హారాన్ని సంపాదించడానికి తను ఆడవలసిన నాటకాన్ని గురించి ఆలోచించసాగాడు. ఒక వేళ ఈ స్త్రీకూడా తనను మోసం చేస్తుందేమో అనిపించింది. ఏనా ముందు ఇంట్లోంచి బయటపడితే తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు.

మరునాడు తెల్లవారుతూ ఉండగా మామూలు ప్రకారం నలుగురైదుగురు చెలికత్తెలతో అరుణవతి జయంత్ గదిలోకి వచ్చింది. ఎదురుగా ఉన్న పళ్ళెంలో తినుబండారాలాగే ఉన్నాయి. వాటినతను ముట్టుకోలేదు.

'ఇంకా మీ పంతం వదలలేదన్నమాట. ఇలా ఎంతకాలం నిద్రాహారాలు లేకుండా ఉండగలరు? ఎప్పటికైనా మీరు నా వశంకాక తప్పదు. చెప్పండి. మీరు నన్ను ప్రేమించగలరా లేదా! పోనీ పెళ్లిచేసుకోనక్కరలేదు. ప్రేమిస్తే చాలు,' ఆ యువతి అంది.

ప్రక్కమీద పడుకున్న జయంత్ లేచి కూర్చున్నాడు.

'నిన్నుమాత్రం పెళ్లి చేసుకోడానికి నేను అంగీకరించను. ఐతే ప్రేమించగలను. కాని నాదో కోరిక ఉంది. ఆ కోరిక తీర్చాలి. అప్పుడే నిన్ను ప్రేమిస్తాను.'

ఆ యువతి ముఖంలో ఆశ చిగిర్చింది. జయంత్ కు కొంచెం దగ్గరగా వచ్చి అడిగింది.

'ఏం కావాలో చెప్పండి.'

జయంత్ ముందు కొంచెం సందేహించాడు. తర్వాత నిర్మొహమాటంగా అడిగాడు.

'నీ ఒంటిమీది నగలన్నీ నాకిచ్చెయ్యాలి.'

ఆ యువతి ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది. మహారాజ కుమారుడికి ఈ నగలతో పనేమిటా అనుకుంది.

'మీరు కోరినప్రకారం నగలన్నీ ఇవ్వగలను. ఈ రత్నాల హారం మాత్రం మరొకటి చేయించి ఇస్తాను.'

జయంత్ ముఖం జేవురించింది.

'అందుకే నిన్ను ప్రేమించలేను. నాకా రత్నాలహారం కూడా ఇచ్చెయ్యాలి. అప్పుడే నేను నీకు లొంగిపోతాను. నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తుంటే నాకోసం ఏమైనా చెయ్యగలవు.'

'ఔను. మీకోసం ఏమైనా చెయ్యగలను. అందుకే మీకు నగలన్నీ ఇస్తానన్నాను. పోనీ ఈ రత్నాలహారం కూడా ఇస్తాను. నన్నుమాత్రం ప్రేమించండి.'

ఒకటొకటిగా తన ఒంటిమీది నగలన్నీ తీసి
కా రత్నాలహారం కూడా తీసి ఇచ్చింది.
హారాన్ని తీసుకుని చూశాడు. అది చాలా
ం. అందుకే ఆ స్త్రీ దీనిని కోరి ఉంటుంది.
యంత్ ప్రక్కనే కూర్చుని అతని భుజంమీద
చెయ్యివేసింది. జయంత్ ప్రక్కకు జరగలేదు.
ఆహారాన్ని స్వీకరించడానికి నాకభ్యంతరం
చాలా ఆకలిగా ఉంది. కాని మీ అందరి
తినలేను. అంచేత ఇప్పుడు వెళ్ళిపోయి సాయం
ాలు వేళకి నువ్వు ఒంటరిగా రా. అప్పుడు
నీకు వశమైపోతాను.' అన్నాడు
ఆనందంతో అందుకంగీకరించింది. తన చెలి
గుండా అవతలికి వెళ్ళిపోయింది. ఆ యువతి
నగల్ని చూస్తూ జయంత్ ఒక గంటకాలం

చేసరికి క్రితంరోజు వచ్చిన యువతి కిటికీగుండా
జయంత్ ఎదుట నిలబడింది.
చూస్తున్నాను. ఇవిగో నువ్వుకోరిన నగలు.
రత్నాలహారం.' జయంత్ అన్నాడు.
రత్నాలహారాన్ని తీసి పరీక్షించి చూసింది.
నందంగా దానిని మెడలో వేసుకుంది.
న నగలు నాకక్కరలేదు. ఇక్కడే ఎక్క
వెళ్లిపోదాం,' అంటూ ఆ యువతి మిగిలిన
కింద దాచేసింది.
బయటికి తీసుకువెళ్లు,' జయంత్ అన్నాడు.
అంటూ యువతి ముందుకు నడిచింది. జయంత్
ను. ఇద్దరూ కిటికీలోంచి తోటలో గదిలోకి

ప్రవేశించారు. యువతి ఆ గదికి ఉన్న తలుపును తట్టి చూసింది. తర్వాత నడుంనుంచి ఒక తాళంచెవి తీసి తాళం తీసింది. ఇద్దరూ అవతలికి చేరుకున్నారు. యువతి మళ్ళీ తలుపుకు తాళం వేసింది.

ఆ తర్వాత ఇద్దరూ ఒక సొరంగం గుండా బయటికి నడిచారు. చివరికి సొరంగం దాటి బయటపడ్డారు.

జయంత్ బయటినించి ఆ ఇంటికేసి చూశాడు. ఇల్లు ఎక్కడా కనిపించలేదు. అదొక కొండ. కొండలోపల గదులు తొలవబడి ఉంటాయి. జయంత్ స్వేచ్ఛగా ఓసారి నిట్టూర్చాడు.

'మీరాజ్యం ఇక్కడికి ఎక్కువ దూరంలేదు. నడుద్దాం పదండి. మిమ్మల్ని మీ కోటకు చేర్చి నేను వెళ్ళిపోతాను'' అన్నదా యువతి.

'పోనీ నీకంత శ్రమదేనికి! ఎటువెళ్ళాలో చెబితే నేనే వెళ్తాను. నువ్వు వెళ్ళిపోవచ్చు.'

'శ్రమ ఏముంది లెండి. నా శ్రమకు తగినఫలం ఈ విలువైన రత్నాలహారం లభించిందిగా చాలు. మిమ్మల్ని మీ కోటదాకా సురక్షితంగా సాగనంపి తర్వాతనే నేను వెళ్తాను.'

ఇద్దరూ నడసాగారు. కొంచెందూరం వెళ్లేసరికి గుఱ్ఱపు డెక్కల చప్పుడు వాళ్ళకు వినిపించింది. ఇద్దరూ దారినించి కొంచెం ప్రక్కకు జరిగి ఒక చెట్టు చాటున దాక్కున్నారు.

కాసేపటికి ఒక రౌతు ఆ దారినే వేగంగా వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ అతననుకొంటున్న మాటలు జయంత్ చెవిలో పడ్డాయి.

'ఈసారి ఎలాగైనా సరే ప్రతాప్ ఎక్కడున్నదీ తెలుసుకు తీరాల్సిందే.' ఇది ఆ రౌతు అన్నమాటలు.

జయంత్ చెట్టుచాటునించి బయటికి వచ్చాడు. గుఱ్ఱం మీద వెళ్లినమనిషి మిత్రువో శత్రువో తనకు తెలీదు. అత నెవరైనా, అతనన్న మాటలు మాత్రం జయంత్‌కు సంబం ధించినవే.

'ఈ గుఱ్ఱం వెళ్లినదారినే వెళ్దాం.' అన్నాడు జయంత్.

'ఎవరో అన్న మాటల్నిబట్టి మీరింకా కష్టాలు పడడం మంచిదికాదు. ముందు మీరు కోటకు చేరుకోడం [illegible] స్కరం.'

ఈ మాటలు జయంత్‌కు నచ్చలేదు. ప్రతాప్ జాడ కనుక్కోకుండా తాను ఇంటికి ఒంటరిగా తిరిగి వెళ్ళడం అతని కిష్టంలేదు.

'నువ్వు ఎన్నయినా చెప్పు. నేనుమాత్రం ఒంటరిగా ఇంటికి వెళ్ళను. నీకంత భయంగా ఉంటే నువ్వు వెళ్లిపో. నేను ఒంటరిగా వెళ్తాను,' అన్నాడు జయంత్.

'సరే. పదండి,' అన్నది యువతి.

ఇద్దరూ ప్రక్కకు తిరిగి రాతు వెళ్లినవైపు నడక సాగిం చారు. మధ్య మధ్య ఆగి ఏమైనా జాడలు తెలుస్తాయేమో చూడనారంభించారు.

'నీ పేరు?' ఆకస్మాత్తుగా జయంత్ యువతిని అడిగాడు.

'నాపేరూ ఊరూ అడగడం మీకు అనవరం. మీకు కావలసిన సాయం నేను చేస్తాను. అంతే' అన్నదా స్త్రీ.

జయంత్ మాట్లాడలేదు. ఇద్దరూ నడకనే ముందుకు సాగి ఒకచిన్న గిబ్బ ఎక్కారు.

'మనకు కావలసినవాళ్లు దగ్గర్లోనే దొరుకుతారను కుంటాను. స్వరక్షణార్థం ఏదైనా ఆయుధం అవసరం. నా దగ్గర ఒక చిన్నకత్తికూడా ఉంది. అది మీరు తీసుకోండి', యువతి అన్నది.

ఆ స్త్రీ అందించిన ఒక పదునైన చిన్న కత్తిని తీసుకుని జయంత్ దానిని భద్రంగా తన దుస్తుల్లో దాచాడు. ఇద్దరూ ఆ దిబ్బదిగి క్రింద మైదానంలోకి చేరుకున్నారు. వెనక ప్రక్కనించి ఏవో మాటలు వాళ్ళకు వినిపించాయి. ఇద్దరూ వెనక్కి తిరిగి దిబ్బకేసి పరీక్షగా చూశారు. ఒక చోట పెద్దరాతి బండ వాళ్ళ కంట బడింది. ఇద్దరూ ఆ రాతి బండ దగ్గరికి వెళ్ళారు.

ఆ యువతి చెప్పిన ప్రకారం జయంత్ తన బలమంతా ఉపయోగించి ఆ రాతిని ప్రక్కకు నెట్టాడు. లోపలికి పెద్ద సొరంగం కనిపించింది. అందులో మెట్లున్నాయి. ఇద్దరూ మెట్లుదిగి క్రిందికి నడవసాగారు. ఇప్పుడు వాళ్ళకేవో కేకలు ఇంకా స్పష్టంగా వినిపించ సాగాయి. అకస్మాత్తుగా వాళ్ళ దృష్టి ఒక దృశ్యం మీద పడింది. ఇద్దరూ ఓ ప్రక్కకు తప్పుకుని ఎవరికీ కనిపించకుండా ఆ దృశ్యం చూడ సాగారు.

అక్కడో చిన్న మండపం ఉంది. ఆ మండపం స్థంభానికి ఒక మనిషి బంధించబడి ఉన్నాడు. తల ఓ ప్రక్కకు ఒరిగి పోయింది. ఇంతకు క్రితమే జయంత్‌కు కనిపించిన రాహు ప్రక్కనే ఉగ్రమూర్తిలా నిలబడి ఉన్నాడు.

'ఊ. చెప్పు. చెప్పి బ్రతికిపోతావా లేకపోతే హింసించమన్నావా?' రాహు గర్జించాడు.

'నాకేం తెలియదు,' స్థంబానికి కట్టివున్న మనిషి హీన స్వరంలో అన్నాడు.

'నీకు తెలుసు. నువ్వు అనవసరంగా అబద్ధమాడుతున్నావ్. ఎందుకు అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకుంటావ్. ప్రతాప్ ఎక్కడున్నాడో చెప్పు,' ఆ రాహు మళ్లీ గర్జించాడు.

వెంటనే మళ్ళీ జవాబు వచ్చింది. 'ప్రతాప్ సంగతి నాకేమీ తెలియదు. మరుక్షణంలో అతని ఎడమ చేతి మీద చిన్నకత్తి దిగిపోయింది. రాతుకళ్ళు భయంకరంగా ఉన్నాయి. అతను ఆ చిన్నకత్తితో బంధింప బడిన మనిషి చేతి మీద, కాళ్ళ మీద గాయాలు చేయసాగాడు. ఆ బాధకు తాళలేక కుంచించుకు పోతున్నా ఆ మనిషి మాత్రం ఏమీ చెప్పడం లేదు.

చెప్పు,' మళ్ళీ రాతు గర్జించాడు.

'నాకేమీ తెలీదు. ప్రతాప్ కోసం నన్ను హింసించడం న్యాయం కాదు', అన్నాడామనిషి.

అతని దీనస్వరాన్ని విన్న జయంత్ ఉండలేక పోయాడు. రాతు చేతి నుండి ఆ మనిషిని కాపాడి అతని ద్వారా ప్రతాప్ జాడ తెలుసుకోవాలని అనుకున్నాడు.

జయంత్ ముందుకు పరుగెత్తాడు. వెనకే ఆ స్త్రీ కూడా వెళ్ళింది.

'ఆగు. కత్తి అవతల పారెయ్. లేకపోతే ప్రాణాలు పోతాయ్,' జయంత్ అరిచాడు.

రాతు జయంత్ వంక చూశాడు.

'మీరిక్కడికి ఎలా వచ్చారు! వచ్చినా మేంచేసే పనుల్తో మీకేం సంబంధం లేదు. మీ అరపులకి నేను లెక్క పెట్టే వాడిని కాదు,' అతనన్నాడు.

మరుక్షణంలో రాతు దృష్టి ఆయువతి మీద పడింది.

'ఏమిటి! నువ్వు కూడా జయంత్‌తో పాటు వచ్చావా! నీ అధికారినే నువ్వు గుర్తించ లేకుండా ఉన్నావా?' ఆ రాతు కోపంగా అన్నాడు. యువతి అతని వంక పరీక్షగా చూసింది.

'మారు వేషంలో ఉన్న మిమ్మల్ని గుర్తించ లేదు; క్షమించండి,' అంటూ ఆ యువతి జయంత్ కేసి తిరిగింది.

'మీకీ విషయాలన్నీ అనవసరం. వెళ్ళిపోదాంరండి,' అన్నది ప్రార్థేయపూర్వకంగా.

'అనవసరం కాదు. ధైర్యంలేకపోతే నువ్వుపో!' జయంత్ అరిచాడు. ముందుకు వెళ్ళి ఆ మనిషి కట్లు కోసి వేయసాగాడు.

ఆ యువతికూడా ఇప్పుడు జయంత్‌కు శత్రువైంది. రాతు, యువతి కలిసి జయంత్‌ను పట్టుకుని బంధించడానికి ప్రయత్నించసాగారు. కాని వాళ్ళకు సాధ్యం కాకుండా ఉంది. వీరుడైన జయంత్‌ను సామాన్యులిద్దరు అడ్డగించ గలరా! ఇద్దర్నీ ఓ ప్రక్కకు నెట్టి అతణా మనిషి దగ్గరకు వెళ్ళాడు. ఇంతలో వెనక నించి ఏదో కేక వినిపించింది.

జయంత్ వెనక్కి చూశాడు. వెనక ఒక సన్యాసిని నిలబడి ఉన్నది. జడలు బాగా పెరిగాయి. మొఖం భయంకరంగా ఉంది. ఎడమ చేతికి తగిలించి ఉన్న సంచిలోంచి సన్యాసిని ఏదో బూడిద తీసి వెదజమ్మింది. ఆ విషపుగాలి ముక్కులికి తగలగానే అక్కడున్న నలుగురూ స్పృహతప్పి పడిపోయారు. సన్యాసిని వికటాట్టహాసం చేస్తూ ముందుకు నడిచింది.

సన్యాసిని స్పృహతప్పిపడి ఉన్న నలుగురి దగ్గరికీ వెళ్ళింది. సంచిలోంచి ఏదో వస్తువు తీసి జయంత్‌కు తప్ప అందరికీ వాసన చూపించింది. అందరూ తెలివి వచ్చి నిద్రలోంచి మేల్కొన్నట్టు మేల్కొన్నారు. జయంత్ మాత్రం అలాగే పడి న్నడు.

స్పృహరాగానే మళ్ళీ మామూలు తతంగం జరిగింది. స్తంభానికి కట్టి ఉన్న ఆమనిషిమాత్రం ఎప్పటికీ ప్రతాప్ సంగతి చెప్పనేలేదు. చివరికి వాళ్ల చేతిలో అతనికి చావు తప్పనే లేదు. చని పోయిన ఆ మనిషిని వాళ్ళు ఒక గొయ్యి తవ్వి గోతిలో పూడ్చి పెట్టారు.

సన్యాసిని రాతు వంక తిరిగి అన్నది.

క్ అనవసరంగా మన విషయాల్లో జోక్యం కలి
ు న్నాడు. అతనిని స్పృహ తప్పి ఉన్న స్థితిలోనే
అతని నగరంలోకి తీసుకుపోయి కోటలో వదలిరా;

ఆమె అజ్ఞను శిరసావహించాడు. స్పృహ తప్పి
ంత్‌ను భుజాల మీద వేసుకుని సారంగం గుండా
ళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు.

ిను కోటలో వదలి మళ్ళీ నన్ను కలుసుకో
ిడికేరా. ఈ లోగా మేమిద్దరం వేరే పని మీద
' అన్నది సన్యాసిని.

ళ్లి [illegible]. సన్యాసిని ఆ యువతిని వెంట పెట్టు
గం గుండా బయటికి వచ్చింది. ఇద్దరూ పడమటి
నడవ సాగారు. మధ్యాహ్నం ఎండెక్కే సరికి
రం నడిచారు. ఓ చిన్న చెరువు గట్టున ఆగి
ిన్న మామిడి చెట్టునుండి పళ్లుకోసి తిన్నారు.
ీళ్లు తాగి చెట్టుక్రింద పచ్చగడ్డిమీద విశ్రమిం

ుసింది. మళ్లీ మెలుకువ వచ్చే సరికి సాయంకాల
ండ తగ్గిపోయి చల్లబడింది. పక్షులు గూళ్లలో
రానికి బయలుదేరుతున్నాయి. ఇద్దరూ నడక
ారు.

ప్రయాణం చేస్తూ దాదాపు అర్ధరాత్రి సమయంలో
ెరువు దరికి చేరుకున్నారు. ఆ చెరువుకొకప్రక్క
ం ఉంది. చెరువుకు నాలుగువైపులా రాతి చప్టా
ప్రక్క చెరువుకు మెట్లున్నాయి. చెరువు నీటితో
ఉంది. [illegible] రాతితో [illegible]

ఆసనాలున్నాయి. చెరువు మధ్యలో ఒక విగ్రహం ఉంది. దాని తలమీద ఇద్దరు ముగ్గురు కూర్చోవచ్చు.

చెరువుకి నాలుగు ప్రక్కలా పెద్దపెద్ద చెట్లున్నాయి. సన్యాసిని, ఆ స్త్రీ ఒక చెట్టు మీదికి ఎక్కి ఆకుల చాటునదాగి చెరువు కేసి చూడ సాగారు.

అకస్మాత్తుగా చెరువు మధ్య ఉన్న విగ్రహం ప్రక్కన నీరు కదిలింది. అక్కడి నుండి ఈదుకుంటూ ఒక ఆకారం ఒడ్డుకు రాసాగింది. చెట్టుమీద కూర్చున్న ఇద్దరూ ఆ మనిషి వంక పరీక్షగా చూస్తున్నారు.

చెరువులోనించి ఈదుకుంటూ ఇవతలికి వచ్చింది ఒక యువతి. కాసేపు ఒడ్డునే నిలబడి చుట్టుపట్ల ఎవరూ లేరని నిర్ణయించుకుని ఒక ప్రక్కకు నడిచి వెళ్లసాగింది.

ఆ యువతికోసం ఎదురు చూస్తున్న సన్యాసినీ, స్త్రీ, చెట్టు మీదినుంచి క్రిందికి దిగి ఆమెమీదకు ఉరికారు. ఆ ఇద్దరిచేతి నుండి చురుగ్గా తప్పించుకుని ఆయువతి వెనక్కి పరుగెత్తు కునివచ్చి చెరువులో దూకింది. సన్యాసిని, ఆ స్త్రీ కూడా పరుగెత్తుకు వచ్చి ఆ యువతితో పాటు చెరువులో దూకారు.

## 6

మరునాడు ఏకాంతంలో కూర్చుని ప్రతాప్ ఆలోచించ సాగాడు. ఈరోజు మంజుల తనకు ఆమె వృత్తాంత మంతా చెబుతానన్నది. మంజుల ఎంత చెడ్డదైనా తనను ప్రేమించింది. అందమైనదే కూడాను. ఆమె వృత్తాంతంవినా లని ప్రతాప్‌కు చాలా కోరికగా ఉంది. వృత్తాంతమంతా విన్నతర్వాత తాను తప్పించుకుపోవడానికి ప్రయత్నించవచ్చు నని అతని ఉద్దేశ్యం. తాను క్రితంరోజు కాసారంలో పడవ మీద షికారు చెయ్యడం, కొండ గుహాలోకి వెళ్ళడం మొద తైన విషయాలు మంజులకు తెలియవు. మంజుల వచ్చేసరికి

తాను యథాస్థానంలో ఉండిపోయాడు. అందుచేత అను మానానికక్కడా ఆస్కారం లేకపోయింది మంజాలకి.

ప్రతాప్ ఆలోచిస్తుండగానే మంజాల ఒయ్యారంగా నడుస్తూ అక్కడికి వచ్చింది. ప్రతాప్‌కు ప్రక్కనే కూర్చుని ప్రేమగా అతని భుజాలమీద తల ఆనించింది. ప్రతాప్ చిరు కోపాన్ని నటిస్తూ ప్రక్కకు జరిగాడు. మంజాల ఇదేమిటీ అని ఆశ్చర్యపోయింది. అతని వంక ఏమిటన్నట్టు చూస్తూ ఉండిపోయింది.

'ఇవ్వాళ నీవృత్తాంతమంతా చెబుతానన్నావు. చెప్పక పోతే నేను నీతో మాట్లాడను,' ప్రతాప్ నవ్వాడు.

'ఓస్. ఇంతేనా,' అన్నట్టు మంజాల నవ్వింది.

'అడగండి చెబుతాను. మీకేయే విషయాలు తెలుసుకోవా లని ఉందో అన్నివిషయాలూ అడగండి,' అంటూ మంజాల మళ్ళీ ప్రతాప్‌కు దగ్గరగా జరిగింది. ఈ సారి ప్రతాప్ ప్రక్కకు తప్పుకోలేదు. మంజాల కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

'ఇప్పుడైనా నువ్వు నీ వృత్తాంతం చెప్పడానికి పూను కున్నందుకు ఆనందంగా ఉంది. ముందు నాకు ఇదేదేశమో, నువ్వెవరో, ఈ దేశానికి రాజెవరో చెప్పు. మిగిలిన విష. యాలు తర్వాత అడుగుతాను.'

మంజాల కాసేపాలోచించింది. తర్వాత నవ్వుతూ ఇలా జవాబిచ్చింది.

'ఇది మధ్రదేశం. నేనీ దేశపు రాజకుమార్తెను. తల్లి దండ్రులు ఏనాడో చనిపోయారు. అందుచేత ఇప్పుడు ఈ దేశానికి నేనే రాణిని. ఇది నేను ప్రత్యేకంగా నిర్మించు కొన్న భవనం. చాలా బాగుందికదూ!'

'బాగుంది. ఐతే నేను గోదావరి తీరంనించి మధ్రదేశానికి వచ్చానన్నమాట. ఇదంతా చేసింది నువ్వేనా?'

'ఔను. ముసలి వ్యాపారికిచ్చి ఉంగరం పంపింది నేనే. మిమ్మల్ని గురించి చాలాసార్లు విన్నాను. మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. మిమ్మల్ని ఎలాగైనా సరే ఈ దేశానికి రప్పించుకుని ఈ దేశానికి కూడా రాజుగా చెయ్యాలనుకున్నాను. అందుకే ఈ విధంగా చేశాను. ఇప్పటికి నా ప్రయత్నం నెరవేరింది.'

ప్రతాప్ ఒక్కక్షణం ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. తర్వాత తలపైకెత్తి మంజూలవంక అనుమానంగా చూశాడు.

'నీకు కిరణ్మయి ఎవరో తెలుసా?' అతను ప్రశ్నించాడు.

కిరణ్మయి పేరు వినగానే మంజూల ముఖం తెలతెలపోయింది. ప్రతాప్ వంక తీవ్రంగా అనుమాన దృష్టితో చూసింది.

కిరణ్మయి పేరు ప్రతాప్ కెలా తెలిసిందో మంజూలకర్థంకాలేదు. ఈ విషయం గురించి ఆలోచించిన కొద్దీ ఆమె గుండె బరువెక్కసాగింది. ఐనా తనస్థితిని దాచడానికి ప్రయత్నిస్తూ మంజూల అన్నది.

'అకస్మాత్తుగా నాకు ఎందుచేతనో గుండెనొప్పి వచ్చింది. రాజవైద్యుణ్ణి పిలిపిస్తాను. ఈ పూటకి సెలవు.'

మంజూల లేచి తడబడుతున్న నడకతో భవనం కేసి నడిచింది. ప్రతాప్ కిదంతా విచిత్రంగా కనిపించింది. మంజూలను అతను అడ్డగించలేదు. కిరణ్మయి పేరెత్తగానే మంజూల ఇలా ఎందుకైపోయిందో అర్థంకాలేదు. మంజూల మందిరంలోంచి ఏ విధంగా తప్పించుకు పోవాలో అతను ఆలోచించసాగాడు. మంజూల తనను మోసగించిందనీ, ఉంగరంలోని

అందుకత్తె మంజుల కాదనీ అతను నిర్ణయించుకున్నాడు. ఐనా మంజులతో మంచిగా ప్రవర్తిస్తేనే తప్ప తనకు మోక్షం లేదు. తాను వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్టు మంజులకు తెలిస్తే తనను బంధించి వేస్తుంది. అప్పుడు తప్పించుకోవడం మరింత కష్టమౌతుంది. అందుచేత మంజులతో మరింత ప్రేమగా ప్రవర్తిస్తున్నట్టు నటిస్తూ తప్పించుకు పోవడానికి మార్గం ఆలోచించాలి.

ప్రతాప్ దగ్గరినించి వెళ్ళిన మంజుల మధ్యగదిలో ఏదో కంగారుగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. వెంటనే తన స్నేహితురాలు వరూధిని ఆమె స్మృతిపథంలో మెరిసింది. వరూధిని తాను నమ్మిన స్నేహితురాలు. సేవకురాలుకూడా. తనకోసం ఏమైనా చెయ్యగలదు. తన్త్రాంగంలో ఆమెది ఆరితేరిన చెయ్యి.* గూఢచారిదళానికి నాయకురాలు కూడాను.

మంజుల వెళ్ళేసరికి వరూధిని తనగదిలో మంచం మీద పడుకుని ఉంది. మంజుల రావడం చూడగానే లేచి కూర్చుంది. మంజులవంక చూసింది.

'ఏమిటి, కంగారుగా కనిపిస్తున్నావ్. ఏంకొంపమునిగింది?' వరూధిని మంజులను అడిగింది.

'కొంప మునిగింది కాబట్టే నీ దగ్గరకు వచ్చాను. మన రహస్యమంతా ప్రతాప్‌కు తెలిసింది. ఎలా తెలిసిందో నాకు తెలియదు,' అంటూ మంజుల సంగతంతా వరూధినికి చెప్పింది.

వరూధిని కూడా కాసేపాలోచించింది.

'ఐతే తప్పకుండా కిరణ్మయి తాలూకు గూఢచారి ఎవరో ఇక్కడికి వచ్చిఉండాలి. వాళ్ళద్వారానే ఈ రహస్యం ప్రతాప్‌కు తెలిసి ఉంటుంది. ఇందులో సందేహమేమీలేదు.'

'మరి ఇప్పుడేం చెయ్యాలి? ప్రతాప్ ఇక్కడున్నట్టు వాళ్ళకు తెలిస్తే వాళ్లు ఊరుకోరు. ఏదోవిధంగా విడిపించుకు పోతారు. రాజభవనంలోకి ప్రతాప్‌ను తీసుకుపోవడానికి భయంగా ఉంది. ప్రతాప్ సంగతి ఇంతవరకు ఆ రాక్షసుడికి తెలియదు. తెలిస్తే ఎవరినీ బ్రతకనివ్వడు. పోనీ ఇక్కడి నించి నగరం వదలి పోదామా అంటే అదీ వీలుకాదు. ఆ రాక్షసుడు లేకుండా రాజ్యం నడపడం మన వల్లకాదు. ఏవిధంగానూ నాకేమీ తోచడం లేదు,' అన్నది మంజుల బాధగా, విచారంగా.

వరూధిని మళ్ళీ తీవ్రంగా ఆలోచించింది.

'సరే. నేను చెయ్యవలసిన పని చేస్తాను. నువ్వు మాత్రం ప్రతాప్ తప్పించుకు పోకుండా కట్టుదిట్టం చెయ్యి. నీ ప్రేమ పాశంలో అతన్ని మరింత దృఢంగా బంధించు,' అన్నది వరూధిని చివరికి నవ్వుతూ.

మంజుల వరూధిని గదిలోనుంచి బయటికి వచ్చింది. ఇప్పుడు తన కర్తవ్యం అతను తప్పించుకు పోకుండా చూడడం. తన మనస్సులోని భావాలను అతనికి తెలియనివ్వకుండా ఉండాలి. అతనితో మరింత సన్నిహితంగా ప్రేమగా ఆప్యాయంగా ప్రవర్తించాలి.

మంజుల ప్రతాప్‌ను విడిచివచ్చిన చోటికి వెళ్ళింది. ప్రతాప్ ఇంకా అక్కడే కూర్చుని ఆలోచిస్తున్నాడు. మంజుల వెళ్ళగానే అతనిప్రక్కన కూర్చుంది.

'ఏమిటిఅకస్మాత్తుగా వెళ్లిపోయావ్?' ప్రతాప్ అడిగాడు.

'గుండెల్లో ఏదో నొప్పివచ్చినట్టయింది. ఆ బాధ భరించలేక వెళ్ళాను. రాజవైద్యుడిని పిలిపిస్తే ఏదో మందిచ్చాడు. ఒక పావు గంటలో తగ్గిపోయింది,' అన్నది మంజుల.

కబుర్లతో కాలం గడచిపోయింది. క్రమంగా సాయం కాలం దాటిపోయి చీకటి పడ సారంభించింది. ఆ సమయంలో ప్రతాప్‌తో చెప్పి మంజుల రెండు గంటలసేపు ఎక్కడికో వెళ్ళిరావడం మామూలే. ఆ సమయంలో ఎక్కడికి వెళ్తుందో ఏదారిన వెళ్ళి ఏ దారిన వస్తున్నదో ప్రతాప్‌కి తెలియదు. అడుగుదామనుకున్నాడు కాని ఇది సమయం కాదని ఊరుకున్నాడు.

ఈ రోజుకూడా మామూలు ప్రకారం రెండుగంటలలో వస్తానని చెప్పి లేచి నిలబడింది. ప్రతాప్ మాత్రం ఆమెను వెళ్ళ నివ్వ దల్చుకోలేదు.

'నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలుసు. ఒక్క క్షణంకూడా నిన్నువదలి ఉండలేను. నా మాట విని ఇప్పుడు నువ్వు ఎక్కడికీ వెళ్ళొద్దు,' ప్రతాప్ దీనంగా అన్నాడు.

ప్రతాప్ మాటలు వింటూంటే మంజులకానందంకలిగింది. ప్రతాప్ తనను ఇంతగా ప్రేమిస్తున్నాడని అనుకోలేదు.

'మీ ప్రేమను కాదనలేను. ఐనా ఇప్పుడు వెళ్ళక తప్పదు; వీలైనంత త్వరగా గంటలోనే తిరిగివస్తాను.'

'ఇప్పుడు ఎంతో హాయిగా వుంది. చల్లటిగాలి మైమర పిస్తున్న ఈ సమయంలో నువ్వు వెళ్ళిపోవడం నాకు చాలా బాధగా ఉంది. నిన్నుమాత్రం వెళ్ళనివ్వను.'

మంజుల మరింత ఆశ్చర్యపోయింది. ప్రతాప్ మనస్సును కష్టపెట్టడం ఆమెకిష్టం లేదు. ఐతే అటు వెళ్ళకుండానూ ఉండలేదు. ఏం చెయ్యాలా అని మంజుల చాలాసేపు ఆలోచించింది. అప్పుడే వరూధిని అన్నమాటలు ఆమెకు గుర్తుకు వచ్చాయి. ప్రతాప్‌ని ఈ సమయంలోనే మరింత

వశపరచుకో వాలని నిర్ణయించుకుంది. వెళ్ళడం మానుకుంది. ఇద్దరూ కాసార తీరంలో తామర పువ్వులతో ఆడుకుంటూ చాలాసేపు ఆనందంగా గడిపారు.

చీకటి దట్టంగా వ్యాపించింది. అక్కడక్కడా కాగడాలు వెలుగుతున్నాయి. ప్రొద్దుపోవడంచేత ఇద్దరూ భోజనానికి లేచారు. ప్రతాప్‌ను గదిలో విడిచిపెట్టి మంజుల ఆహార పదార్థాలు తెప్పించడానికి వెళ్ళిపోయింది. ప్రతాప్ ఏవో ఆలోచనలో మునిగిపోయాడు.

పావు గంటలో మంజుల తిరిగి గదిలోకి వచ్చింది. ఒక సేవకురాలు ఆహార పదార్థాలు తెచ్చి ఇద్దరిముందు ఉంచింది. ఇద్దరూ భోజనం చేశారు. మంజుల అందించిన తములపాకు చిలకల్ని ప్రతాప్ నమలసాగాడు. మంజుల అతని ప్రక్కనే కూర్చుంది.

కాలం అనుకోకుండానే గడచింది. ఇద్దరూ పడుకున్నారు. ప్రతాప్ త్వరలోనే నిద్రపోయాడు. మంజులకి మాత్రం నిద్ర పట్టలేదు. ప్రతాప్ బలవంతం చెయ్యడంవల్ల తాను బయటికి వెళ్ళలేదు. కాని వెళ్ళలేదని మథనపడసాగింది. వెళ్ళనందుకు ఏదో భయం ఆందోళన ఆమెనావరించాయి. క్రమంగా అర్థరాత్రి కావచ్చింది. ఎక్కడినించో పన్నెండు గంటలు కొట్టిన చప్పుడు వినిపించింది.

మంజుల మంచంమీదినించి లేచింది. ప్రతాప్ మంచం కేసి చూసింది. అతను గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ప్రతాప్ గాఢ నిద్రలో ఉన్నట్టు మంజుల తెలుసుకుంది. లేచి ప్రక్క తలుపు తెరచుకొని మరో గదిలోకి వెళ్ళింది. మళ్ళీ తిరిగివచ్చి ప్రతాప్ నిద్ర పోతున్నదీ లేనిదీ చూసిం . అతను ఇప్పుడు కూడా గాఢ నిద్రలో ఉన్నట్లు గ్రహించి తిరిగి వెళ్ళిపోయింది. అంతే. మళ్ళీ గంటవరకు తిరిగి రాలేదు.

మధ్యలో ప్రతాప్‌కు మెలుకువ వచ్చింది. మంజుల మంచం మీద కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళిందో అనుకున్నాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం ఎక్కువైంది. లేచి తలుపు తెరవడానికి ప్రయత్నించాడు. కాని తలుపు అవతలివైపున గడియవేసి ఉంది. మంజుల సాయంకాలానికి బదులు ఈ సమయంలో తాను వెళ్ళవలసిన చోటికి వెళ్ళి ఉంటుందని ప్రతాప్ గ్రహించాడు. ఏంచెయ్యడానికీ తోచక తిరిగివచ్చి మంచంమీద పడుకున్నాడు.

చాల సేపటికి తలుపు తీస్తున్న చప్పుడైంది. ప్రతాప్ మంచంమీద ఓ ప్రక్కగా పడుకుని గురకవేస్తూ నిద్రపోతున్నట్టు నటించసాగాడు. మంజుల గదిలోకి వచ్చింది. ప్రతాప్‌కేసి చూసి అతను నిద్రపోతున్నాడనుకుంది. తన మంచంమీద పడుకుంది.

# 7

ఉదయం ఎనిమిది గంటల వేళ. పక్షులన్నీ ఆహారం పోగు చేసుకుని గూళ్ళకు చేరుకుంటున్నాయి. సూర్యుని రాకతో కొలనుల్లోని కలువపూలు పూర్తిగావిచ్చుకున్నాయి. పూల మొక్కలు విరియబూశాయి. సువాసన నల్దిక్కులా వ్యాపిస్తోంది. చెట్ల ఆకుల మధ్యగా గాలి రయ్యిన వీస్తోంది. వాతావరణం హాయిగా ఉంది.

కిరణ్మయి తన గది ముందున్న అరుగుమీద విశ్రాంతిగా కూర్చుంది. ఇద్దరు సేవకురాండ్రు చెరోక వైపున నిలబడి సంభాషిస్తున్నారు. కిరణ్మయి ఏదో ఆలోచిస్తూ చటుక్కున ఒక సేవకురాలికంక తిరిగి అడిగింది.

'కాళి ఇంకా రాలేదేమి?'

'తెలియదండి. వెళ్ళికూడా చాలా కాలమైనట్టుంది.'

సు. ఒకవారం దాదాపు కావస్తోంది. వెళ్ళిన పని లేదో?'

శి వస్తే పని జరగకుండా ఉండదు లెండి. ఏమైనా ఆవాంతరాలు ఏర్పడివాయేమో!'

న్మయి మరేం కేమీ అడగ లేదు. అరుగుమీదనించి లేచి గా నడవసాగింది. దాసీలు వెనకే బయలుదేరారు. కి కాసేపు ఒంటరిగా ఉండాలనిపించింది. వెనక దాసీలను రావద్దని సంజ్ఞ చేసింది. ఇద్దరూ ఆగిపో కిరణ్మయి కాళిని గురించే ఆలోచిస్తూ కు సాగింది.

రంగా నీటి ఫౌంటెన్ ఉంది. దానిలోంచి మంచినీరు గా నాలుగు దిక్కులకీ వెలువడుతోంది. ఫౌంటెన్ కు ప్రక్కలా చలువరాతి మెట్లున్నాయి. ఓ ప్రక్కగా వతుల విగ్రహాలు మరో ప్రక్కగా విష్ణువుల లు చలువరాతితో నిర్మించబడ్డాయి.

న్మయి ఫౌంటెన్ దగ్గరకు వెళ్ళింది. ఎత్తుగా ఉన్న మెట్టుమీద కూర్చుని ఫౌంటెన్ కేసి చూడసాగింది. గా ఉన్న సూర్యుడు ఫౌంటెన్ వెదజల్లుతున్న నీటి రంగు రంగుల్లో కనిపిస్తున్నాడు. కిరణ్మయి ఆ వింత ఆనందంగా చూస్తోంది. ఫౌంటెన్ మీదుగా గాలి ఆమె శరీరానికి తగిలి పులకరింప చేస్తోంది. నీటి వింతకాంతులు ఆమె మీదపడి ఆమె సౌందర్యాన్ని పెంపొందిస్తున్నాయి.

ధ్యానంలో ఉన్న కిరణ్మయికి అడుగుల చప్పుడు విని ది. కిరణ్మయి అదాటున ప్రక్కకు చూసింది. ఎదు యువతి నిలబడి ఉంది. ఆమె ముఖం మీద చిరు నాట్య మాడుతున్నాయి. ఆ యువతిని చూసి

కిరణ్మయి కూడా నవ్వకుండా ఉండలేక పోయింది. ఆమె ఆనందానికి అంతులేకుండా ఉంది.

'రోజూ నీకోసం ఎదురు చూడకుండా ఉండలేక పోయాను కాళీ! ఇన్నాళ్ళు చేశావేమిటి?' కిరణ్మయి అడిగింది.

'వెళ్ళిన పని త్వరగా కావద్దూ. ఇన్నాళ్లు ఎన్ని తిప్పలు పడ్డానో మీకేం తెలుసు!'

'ఇంతకీ వెళ్ళిన పని జరిగిందా? ఆయన ఏమన్నారు? ఏం జరిగిందీ త్వరగా చెప్పు.'

'ఏం చెప్పాలో నాకర్థం కాకుండా ఉంది. వెళ్ళిన పని పూర్తి కాక ముందే మరో అనర్థం దాపురించింది. ఇంకా నాకు చాలా పని ఉంది. కాని మీరు ఎంత కంగారు పడుతున్నారో నని ముందిక్కడికి వచ్చాను. మళ్ళీ వెంటనే బయలుదేరి వెళ్ళాలి.'

'ఇంతకీ అసలేం జరిగిందీ చెప్పనేలేదు.'

'చెప్పేదేముంది. నేను ముసలి వ్యాపారి వేషంలో వెళ్ళి రాజకుమారుల్ని కలుసుకున్నాను. వాళ్ళా సమయంలో ఏకాంతంలోనే ఉన్నారు కూడా. ఇద్దరికీ నేను ఉంగరాలు బహూకరించాను. మీ ఫోటో ఉన్న ఉంగరం ప్రతాప్ గారికి సురక్షితంగా చేరింది.'

'ఆయన ఏమన్నారు?'

'ఏమీ అనలేదు. తర్వాత నేను వచ్చేశాను. రాజకుమారులు పడవ మీద షికారుకు బయలుదేరినప్పుడు నేను రహస్యంగా వాళ్లను అనుసరించాను. ఒడ్డున నడుస్తున్న నాకు పడవ మీద ఉన్న రాజ కుమారుల ముఖాలు బాగానే కనిపించాయి. ప్రతాప్ ఉంగరంలో ఉన్న మీ ఫోటోని గురించి ఆలోచిస్తున్నారని నేను గ్రహించాను. ఆయన మీ

ఫొటో నే వరించారు. మిమ్మల్ని ప్రేమించడంలో ఆశ్చర్యం లేదు.'

ఈ మాటలు వినేసరికి కిరణ్మయి ఆనందానికి హద్దులులేక పోయాయి. ఏదో అడగబోతుండగా కాళి ముందుగానే అన్నది.

'కాని ఒక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. ఆ ఘటన గురించి వింటే బాధ కలగక తప్పదు. వినా చెప్పకుండా ఎలా?'

కిరణ్మయి ముఖం క్షణంలో వివర్ణమైంది. తెల్ల బడిన ముఖంతో అడిగింది.

'ఏం జరిగింది?'

'మనం వేసిన ప్లాను మంజాల గూఢచారులకి ముందుగానే తెలిసి ఉంటుంది. ఉంగరం సంగతి తెలియగానే మంజాల మరో ఎత్తువేసింది. మీలా వేషం వేసుకుని ఆ రాత్రి రాజ కుమారులు షికారు వెళ్లినచోట నృత్య గానాలారంభిం చింది. అడవిలో ఆదేమిటో చూద్దామని వెళ్ళిన ప్రతాప్‌ను మీ రూపంలో ఉన్న మంజాల తేలిగ్గా వశపరచుకొంది. చివ రికి ఎలాగో తన రహస్య మందిరానికి ఆయన్ని చేర్చింది.'

కిరణ్మయి బాధగా మూలిగింది.

'మనం వేసిన ప్లాను మరొకరికి బాగా ఉపయోగించిం దన్నమాట. మంజాల మొదటినించి ఇలా ప్రవర్తిస్తూనే ఉంది'

కాళి కాసేపు మాట్లాడ లేదు.

'మరి మనమిప్పుడేం చెయ్యాలి?' కిరణ్మయి కాళిని అడి గింది.

'చెయ్య వలసిందేదో కొంతవరకు నేను చేసే వచ్చాను. మీరు కంగారు పడి పోతారనీ త్వరగా తిరిగి వచ్చాను కాని

తేకపోతే ఆయన్ని రహస్య మందిరం నించి విడిపించి వచ్చే దాన్ని. అందుకే ఇప్పుడు మళ్ళీ తిరిగి వెళ్ళాను.' కాళి అన్నది.

'ఇంతకీ నువ్వేం చేశావ్?'

'జయంత్ ప్రతాప్ ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. తర్వాత చాలసేపటికి జయంత్ ఒక్కరే తిరిగివచ్చి పడవ మనిషికి సంగతంతా చెప్పి నగరానికి పంపించారు. తను తిరిగి ప్రతాప్ కోసం వెదకడానికి అడవిలోకి వెళ్ళిపోయారు. పడవ వాడు పడవమీద ఇవతలి ఒడ్డుకువచ్చి పడవ నక్కడ వదలి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయాడు. నేనా పడవమీద అవతలి ఒడ్డు చేరుకున్నాను. అడవిలో వెదకగా నాకు మంజూలకు సంబంధించిన కొన్ని చిహ్నాలు దొరికాయి. మంజూలే ఈ పనంతా చేసి ఉంటుందని భావించాను. దాని రహస్య మందిరానికి ప్రయాణం కట్టాను.'

'అక్కడ ప్రతాప్ నీకు కనిపించారా?'

'అదృష్టవశాత్తు కనిపించారు. ఆయన తన కిచ్చిన ఉంగరంలోని ఫోటో మంజూలదేనని భ్రమలో ఉన్నారు.'

'మంజూల అలాంటి భ్రమ కలిగించి ఉంటుంది.'

'ఆ భ్రమ తొలగించడానికి నేను ప్లాను వేశాను. ఓ కాగితం మీద మీరు రాసినట్టుగా రహస్యాన్ని వెల్లడిస్తూ ఓ ఉత్తరం రాసి ఆయన కందించాను.'

'అది ఆయన చదివారా?'

'చదివేవరకు నే నక్కడ ఉండడం ప్రమాదకరం. అంచేత వెంటనే వచ్చేశాను. ఆయన చదివే ఉంటారు. నిజం తెలిసి ఉంటుంది.'

'ఐతే ఆయనను విడిపించడానికి నువ్వు ఒంటరిగా ప్రయత్నించగలవా? లేక మరెవరైనా తోడు కావాలా?'

'ఎవరూ అక్కరలేదు. అసలు వాళ్ల గూఢచారులే ఈ పాటికి అక్కడికి చేరుకుని ఉంటారు. మంత్రవాది సామాన్యుడు కాదు.'

'సరే. వెళ్లు. ప్రయాణానికి నీకేం కావాలో వెంట తీసుకువెళ్లు. నేను ప్రతాప్‌ను ఎంతగా ప్రేమిస్తున్నదీ నీకు తెలుసు. ఆయన లేకుండా నేను బ్రతకలేను. ఆయన్ని చూడకుండా ఉండలేను. ఆయనను విడిపించే భారం నీది. నీమీద ఆశపెట్టుకు బ్రతుకుతాను. నీకు మించినవాళ్లు నాకెవరున్నారు కనుక!' కిరణ్మయి బాధగానే అన్నది.

కాళి కిరణ్మయికి దగ్గరగా వెళ్ళింది. భుజాలమీద చేతుల్తో తడుతూ అంది.

'ఈ మాత్రం పని నేను చెయ్యలేనా? ఒంట్లో ప్రాణాలున్నంతవరకు మీకు కావలసిన ప్రతి పనీ చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నాను.'

'కిరణ్మయి లేచి ఆప్యాయంగా కాళిని కౌగలించుకొంది. తర్వాత ఇద్దరూ మౌనంగా భవనంకేసి నడిచారు.

'ఒక పావుగంటలో నేను తిరిగి బయలుదేర బోతున్నాను. ఇక్కడ మీరుమాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి. శత్రువుల గూఢచారులు మనచుట్టూ ఉన్నారు,' కాళి కిరణ్మయిని హెచ్చరించింది.

## 8

ప్రతాప్ బలవంతం చెయ్యడంవల్ల మంజుల రోజూ సాయంకాలం తాను వెళ్లవలసిన చోటికి వెళ్లడం మానేసింది. కాని అందుకు బదులుగా ఆమె అర్ధరాత్రి సమయంలో లేచి వెళ్తోంది. ప్రతాప్ నిద్రపోతున్నాడో లేదో పరీక్షించడం, ప్రక్క గదిలోకి వెళ్ళిరావడం, తిరిగి ప్రతాప్ నిద్ర

పోతున్నదీ లేనిదీ చూడడం, తర్వాత వెళ్ళిపోయి గంట దాటిం తర్వాత రావడం మంజులకు నిత్యకృత్యమై పోయింది.

ప్రతాప్ రోజూ ఇదంతా చూస్తూనే ఉన్నాడు. కాని మంజుల ఎక్కడికి వెళ్తున్నదీ తెలుసుకోడానికి వీలుపడడం లేదు. లేచి తలుపు నెట్టిచూడడం, అవతలి వైపున తలుపు వేసి ఉండడంచేత నిరాశగా తిరిగివచ్చి మంచంమీద వాలి పోవడం ప్రతాప్‌కు మామూలై పోయింది.

మంజుల తిరిగి వచ్చేవరకు రోజూ ప్రతాప్ ఇదే ఆలోచిస్తుండేవాడు. మంజులను మోసగించి ఎలాగైనా సరే ఆమె ఎక్కడికి వెళ్తున్నదీ తెల్సుకోవాలి. రోజు రోజూ అతనిలోని ఆకాంక్ష పెరగసాగింది. కాని అందుకు ఏ ఉపాయమూ లేక పోవడంచేత మౌనంగా ఉండక తప్పడం లేదు.

ఆ రోజుకూడా మంజుల దాదాపు పన్నెండు గంటల సమయంలో తన మంచంమీదనించి లేచింది. ప్రతాప్ గుర్రుపెట్టి నిద్రపోతున్నట్టు నటిస్తున్నాడు. మంజుల అతని వంక చూసింది. ఆ రోజు తాను వెళ్ళవలసిన సమయం మించి పోయిందేమోనని మంజుల కంగారు పడింది.

ప్రతాప్ నిద్రపోతున్నాడని గట్టిగా నిర్ణయించుకున్న తర్వాత మంజుల గోడకు తగిలించి ఉన్న దీపం ఒత్తి తగ్గించి ప్రక్క గదిలోకి వెళ్ళిపోయింది. అంతే. మళ్ళీ వచ్చి ప్రతాప్ నిద్రపోతున్నదీ లేనిదీ రెండోసారి చూడలేదు.

ప్రతాప్ కళ్ళు తెరచి చూచాడు. మంజుల లేదు. ఈసారి రెండోసారి వచ్చి చూడలేదని అతను గ్రహించాడు. అందుకేమైనా కారణం ఉంటే ఉండవచ్చు. ప్రతాప్ మంచం మీదనించి లేచాడు. తలుపు దగ్గరికి వెళ్ళి నెట్టాడు. తలుపు తెరచుకుంది. అతని ఆశ్చర్యానికి అంతు లేదు. రోజూ

అవతలి వైపున బంధింపబడి ఉండే తలుపు ఇవ్వాళ ఎందుకని తెరచి ఉంది.

మంజుల అటు వైపున తలుపు వెయ్యడం మర్చిపోయి ఉండవచ్చు లేదా అనవసరంగా భావించి ఉండవచ్చు. ప్రతాప్ తలుపుగుండా అవతలిగదిలోకి ప్రవేశించాడు. వెనక నించి తలుపువైపు చూశాడు. దానికక్కడా గడియున్నట్టు అతనికి కనిపించలేదు. అతనికి మరింత ఆశ్చర్యం వేసింది. అంటే ఈ తలుపుకు మంజుల రోజూ తాళంవేస్తి వెళ్తుండే దన్నమాట. ఇవ్వాళ మాత్రం వెయ్యలేదు.

ప్రతాప్ గది నాలుగు మూలలా పరిశీలించి చూశాడు. ఈ గదికూడా తాము పడుకునే గదిలాగే ఉంది. ఐతే ఈ గదికి కిటికీలు మాత్రం లేవు. ఒకే ఒక తలుపు ఉంది. తలుపు ప్రక్కగా చిన్న అల్మారా ఉంది. దానికీ తాళంవేసి ఉంది

ప్రతాప్ తలుపు దగ్గరకు వెళ్ళి దానిని నెట్టి చూశాడు. కాని లాభం లేకపోయింది. తలుపుకు తాళం వేసి ఉంది. ప్రతాప్ ఆలోచించాడు. ఇలాంటి గదులు మధ్యలో ఎన్ని ఉన్నాయో! ఇన్ని గదులకీ తాళాలు వేసుకుంటూ మంజుల ఎక్కడికి వెళ్తున్నదో?

ప్రతాప్ నిరాశగా వెనక్కి తిరిగాడు. ఈ రోజు ఒక క్రొత్త గదిని చూడ గలిగాడు. అంతే. అంతకు మించి ఏ మాత్రం ముందుకు అడుగు వెయ్యలేకపోయాడు. వెనక్కి తిరిగి వచ్చి తన గదిలో మంచంమీద ప్రతాప్ కూర్చోబో యాడు. ఇంతలో అతని భుజాలమీద ఎవరివో చేతులానాయి. ప్రతాప్ ఆశ్చర్యంగా తల వెనక్కి తిప్పి చూశాడు. ఎవరో ఆజానుబాహుడైన వ్యక్తి. బుగ్గమీసాలు, మెడలో రుద్రాక్ష మాల. బాగా పెరిగిన ఉంగరాల జుట్టు. మొఖం కొంచెం భయంకరంగా ఉంది. చూడ్డానికి కావాలని కొన్ని

ప్రత్యేకాలంకారాలు చేసుకున్నట్టనిపిస్తోంది. ప్రతాప్ ఆ వ్యక్తివంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయాడు.

ఎవరీ వ్యక్తి? ఇంతకు క్రితం ఈ ప్రాంతంలో మగవాళ్ళ నెవర్నీ చూడలేదు. ఈ రహస్య మందిరంలోకి ఇతనెలా రాగలిగాడు? ఏ త్రోవగుండా వచ్చాడో? ఇంతకీ తనకు మిత్రుడో, శత్రువో? ప్రతాప్ పరిపరివిధాల ఆలోచించ సాగాడు. ఆవ్యక్తికూడా కాసేపటివరకు మాట్లాడకుండా మౌనంగా నిలబడ్డాడు.

ఒక్క నిమిషం అలా మౌనంగా గడచింతర్వాత ఆ వ్యక్తి బయటికి వెళ్దాం రమ్మని సంజ్ఞ చేశాడు. ప్రతాప్ బయటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఇద్దరూ కాసార తీరానికి వచ్చారు. అక్కడ చాటుగా ఓచోట కూర్చున్నారు. తన సందేహాలన్నీ తీర్చుకోడానికి ఇదేసమయమని ప్రతాప్ భావించాడు. ఏదో అడుగుదామని అతననుకుంటుండగానే ఆ వ్యక్తి అడిగాడు.

'మీరు నన్ను గుర్తు పట్టగలరా?'

ప్రతాప్ ఆలోచించాడు. కంఠ స్వరం తనకు పరిచితమైనదిలాగే ఉంది. ఐతే ఈ వ్యక్తిని ఎక్కడ చూసిందీ అతనికి గుర్తులేదు. ఎవరైందీ తెలియదు. తనను గుర్తుపట్టగలరా అని అడుగుతున్న ఈ వ్యక్తి తప్పకుండా తనకు పరిచితుడై ఉండాలి.

'నువ్వెవరవో నేను గుర్తు పట్టలేకుండా ఉన్నాను,' ప్రతాప్ జవాబిచ్చాడా వ్యక్తికి.

రాత్రి సమయం. అందులోనూ చీకటి. మబ్బులతో దోబూచులాడుతున్న అర్ధచంద్రుడు కాసేపు వెలుగునిస్తూ కాసేపు దాక్కుంటున్నాడు. ఆ మసక చీకటిలో ప్రతాప్‌కు ఆ వ్యక్తిని పరీక్షగా చూద్దామన్నా వీలులేకుండా పోయింది.

ప్రతాప్ తనను గుర్తు పట్టలేదని నిర్ణయించుకున్న తర్వాత ఆ వ్యక్తి తన చొక్కా జేబులోంచి ఒక పొట్లాం బయటికి తీశాడు. అందులోంచి తళతళ మెరుస్తున్న ఒక మొహరు బయటికి లాగాడు.

'ఇది చూడండి,' ఆ వ్యక్తి అన్నాడు.

ప్రతాప్ ఆ మొహర్‌ను చేతిలోకి తీసుకొన్నాడు. దానిని చూసీచూడగానే అతని ముఖంలో మార్పు కనిపించింది. ఆనందంతో తబ్బిబ్బైపోతూ 'మంత్రవాదీ! మనవాళ్ళంతా కులాసాయా?' అని అడిగాడు.

'ఆ! మీకోసమే అన్వేషిస్తూ నేను బయలు దేరాను. జయంత్ గారికోసం మిగిలినవాళ్లు వెదకుతున్నారు.'

'జయంత్ కూడా కనిపించకుండా పోయాడా?' ప్రతాప్ చాలా ఆశ్చర్యంగా అడిగాడు.

'ఔను. మీకోసమని వెదకడానికి బయలుదేరారు. అంతే మళ్ళీ కనిపించలేదు.'

'నాన్నగారు కులాసాగా ఉన్నారా?'

'ఆ! మీకోసమే కంగారు పడుతున్నారు.'

ప్రతాప్ కాసేపు మౌనం వహించాడు.

'ఈ వేషంలో నిన్ను గుర్తు పట్టలేకపోయాను. వేషం బాగా వేశావే!' చివరికి అన్నాడు.

'మా వృత్తే అది కదండీ? గూఢచారులం ఘడియ కొక వేషం వేస్తాం,' మంత్రవాది నవ్వుతూ అన్నాడు.

వచ్చినదారి చాలా కష్టమైంది. ఆ దారిని ఇద్దరం కష్టం. ఒక వేళ ఎవరికంటనైనా పడ్డామంటే ఇక రలేదు. అంచేత తప్పించుకు పోవడానికి మరొక ఆలోచించాలి. మీరా ప్రయత్నంలో ఉండండి. రాత్రిపూట ఈ సమయంలో కలుసుకుని మీకు సహాయం నేను చేస్తుంటాను,' మంత్రవాది

•

ంచుకు పోవడానికి మరో మార్గంమాత్రం ఏముంది?' కుండా ఈ రహస్య మందిరంలోకి మంచిమార్గం ండి ఉంటుంది. మంజూల ఆ మార్గానే వచ్చిపోతూ . ఆ మార్గం మనం కనుక్కోవాలి.'

. అదే మంచిది. ఈ రహస్య భవనపు సంపూర్ణ న్ని తెలుసుకోవడం ఎందుకైనా మంచిది. ఒక వేళ కూడా ఈ ప్రాంతంలోనే ఉండి ఉండవచ్చు. ంటే రోజూ మంజూల రాత్రిపూట ఎక్కడికి వెళ్ళి ' తెలుసుకోవాలని నాకు చాలా కోరకగా ఉంది.'

ంకే మంజూలతోపాటు రాత్రిపూట ఆమె నను స ్యాలి. అప్పుడు కొంత రహస్యం తెలుసుకోడానికి .'

మంజూల వెళ్ళిపోతూ తలుపులకు వెనక ప్రక్కగా సి వెళ్తుంది. అందుచేత ఆమెను అనుసరించివెళ్ళడం .'

మనం ప్రయత్నించవచ్చు. మీరా తాళం పరీక్షిం దో? ఆ తాళం తలుపుకు మధ్యగా ఉండి రెండు ండి వెయ్యడానికి తియ్యడానికి వీలుగా ి.'

'నేనది గమనించలేదు. ఐనా అందువల్ల మనకు కలిగే లాభమేమిటి?'

'లాభం తప్పకుండా ఉంది. ఒకే తాళంచెవితో తాళం వెయ్యడం తియ్యడం రెండు ప్రక్రియలనించీ సాధ్యమౌతుంది. ఆ తాళంచెవిని మనం సాధించాలి.

'అదెలా సాధ్యమౌతుంది?'

'మీరు ఎలాగైనా సరే, ఒక విషయం తెలుసుకోండి. తాళపు చెవిని మంజుల ఎక్కడ దాస్తుందో మీరు జాగ్రత్తగా పరిశీలించి తెల్సుకోండి. ఆ స్థలం నాకు తెలిస్తే ఎప్పుడో ఒకప్పుడు ఆ తాళపు చెవి నేను తీసుకుపోయి అలాంటి తాళపుచెవి తయారు చేయించుతాను. పాత తాళపు చెవిని యథాస్థానంలో ఉంచుదాం. కొత్త తాళపు చెవితో మన పని జరిగిపోతుంది.'

ప్రతాప్ ఆలోచించాడు. తాళపు చెవిని మంజుల ఎక్కడ దాస్తుందో ఈ రాత్రి చాలా జాగ్రత్తగా పరిశీలించాలి.

'సరే. అలాగే చేద్దాం. ఈ రాత్రే తాళపు చెవి ఎక్కడ ఉండేదీ నేను కనుక్కుంటాను. రేపురాత్రి మళ్ళీ ఇదే సమయంలో నన్ను కలుసుకో,' ప్రతాప్ అన్నాడు.

ప్రతాప్ దగ్గర సెలవు తీసుకుని మంత్రవాది వెళ్ళిపోయాడు. అతను ఎటు వెళ్తున్నదీ గమనించాలని ప్రతాప్ అనుకున్నాడు కాని మంజుల తిరిగివచ్చే సమయమైందని వెనక్కివచ్చేశాడు. ఇంకా అప్పటికి మంజుల రాలేదు. మంత్రవాది చెప్పిన ప్లానును గురించి ఆలోచిస్తూ ప్రతాప్ మంచంమీద కూర్చున్నాడు. మంజుల తాళపు చెవిని ఎక్కడ దాచి వేస్తున్నదో తెలుసుకోడం అతనికో సమస్యలా అనిపించింది.

వెంటనే అతనికో ఆలోచన తట్టింది. గదితలుపు మూసి ఉంది. దానికి తాళం వేసిలేదు. తాళం వేయనప్పుడు రంధ్రం గుండా చూస్తే అవతలిగదిలో ఏంజరుగుతున్నదీ తెలియవచ్చు.

ప్రతాప్ మంచం మీదినించి లేచి తలుపు దగ్గరకు వెళ్ళాడు. ఒక కన్నుమూసి రెండో కంటితో రంధ్రం గుండా చూశాడు. ఎదురుగా రెండో గదితలుపు కనిపించింది. దాని ప్రక్కనే ఉన్న అల్మారా కనిపించింది. అల్మారాకి పైగా దీపం పెట్టడానికి ఒక చిన్న చెక్క ఉంది. అది కూడా కనిపించింది.

ప్రతాప్ చూస్తూండగానే ఆ గది తలుపు తీస్తున్న చప్పుడైంది. ప్రతాప్ జాగ్రత్తగా పరీక్షిస్తూ నిలబడ్డాడు. మంజుల ఆ గదిలోకి వచ్చి తలుపుకు తాళం వేసింది. తాళపు చెవిని తీసుకుని అల్మారా దగ్గరకు వెళ్ళింది. దీపం పెట్టడానికని ఏర్పాటు చేసిన చెక్కను పైకెత్తింది. అక్కడో చిన్న పెట్టె ఉంది. ఆ పెట్టెలో మంజుల తాళం చెవి వేసింది.

మంజుల అవతలి గదిలోంచి ఇవతలికి వచ్చేలోపునే ప్రతాప్ గబగబా తన మంచం మీదకి వచ్చి పడుకున్నాడు. దుప్పటి కప్పుకుని గాఢనిద్రలో ఉన్నట్టు నటించ సాగాడు.

మంజుల గదిలోకి వచ్చింది. ప్రతాప్ వంక చూసింది. ప్రతాప్ నిద్రపోతున్నట్టు భావించింది. తనుకూడా మంచం మీద పడుకుని విశ్రాంతిగా నిద్రపోసాగింది.

తాళపు చెవిని మంజుల ఎక్కడ దాస్తున్నదీ ప్రతాప్ చూశాడు. కాని రంధ్రంగుండా తాళపు చెవి సరిగా ఎక్కడ ఉందో తెల్సుకోవడం కష్టమైంది. అందుచేత మంజుల నిద్రపోతుండగా తాను తాళం చెవి ఎక్కడుందో సరిగా వెదకి తెలుసుకోవాలనుకున్నాడు.

అలసిపోయి వచ్చిన మంజుల త్వరలోనే గాఢ నిద్రలో మునిగి పోయింది. తన పనిని కొనసాగించడంలో ప్రతాప్‌కు ఏ అడ్డం లేకపోయింది.

నెమ్మదిగా మంచం మీద నించి లేచి తలుపు తీసుకుని రెండో గదిలోకి ప్రవేశించాడు. అల్మారా దగ్గరికి వెళ్ళి దాని మీదగా ఉన్న దీపపు చెక్కను పైకెత్తాడు. అక్కడో చిన్న పెట్టె కనిపించింది. ప్రతాప్ ఆ పెట్టెలో వెదికాడు. అందులో ప్రతాప్‌కు రెండు తాళం చెవులు దొరికాయి. రెంటినీ బయటికి తీసి పరీక్షించాడు. ఒకటి అల్మారాదనీ, మరొకటి తలుపుదనీ అతను తెలుసుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు. తాళం చెవుల్ని అక్కడే వదలి ప్రతాప్ వెనక్కి తిరిగి వచ్చాడు.

## 9

మరునాడు ప్రతాప్ మంజులతో రాత్రి పదిగంటల వరకు కబుర్లు చెబుతూ గడిపాడు. మంజుల కూడా ప్రతాప్ తన పట్ల కనబరుస్తున్న ప్రేమకు ఉబ్బిపోయింది. తను అర్ధరాత్రి వేళ ఎక్కడికో వెళ్ళి వస్తున్న సంగతి ప్రతాప్‌కు తెలియదని ఆమె ఉద్దేశం. ప్రతాప్ ఆ సమయంలో మేలుకోవడం లేదని ఆమె నమ్మకం. ప్రతాప్ కూడా అందుకను గుణంగా తనకేమీ తెలియనట్టుగానే ప్రవర్తిస్తున్నాడు.

పదిగంటలు దాటింతర్వాత ఇద్దరూ పడుకున్నారు. మంజుల మాత్రం నిద్రపోలేదు. తాను పన్నెండు గంటలికి బయటికి వెళ్ళ వలసిన పని ఉంది. ఒకవేళ ఇప్పుడు నిద్ర పోతే పన్నెండు గంటలికి మెలుకువ రాక పోవచ్చు. అందు చేత మంజుల వస్తున్న నిద్రను బలవంతాన ఆపుకొంటూ కాలం గడపుతోంది.

ప్రతాప్ పడుకొన్న కాసేపట్లోనే అదమరచి నిద్రపోసాగాడు. మంజుల ఎక్కడికి వెళ్ళినా ఇప్పుడతనికి చింత లేదు. తాను ఒకవేళ ఆ సమయంలో గాఢనిద్రలో ఉన్నా మంత్రవాది వచ్చి తప్పక లేపుతాడు. ఇదీ అతని ధైర్యం.

రాత్రి పన్నెండు గంటలయింది. మంజుల లేచి ప్రతాపు వంక చూసింది. ఇవ్వాళ అతను నిజంగానే గాఢనిద్రలో ఉన్నాడు. మంజుల రోజూ మాదిరిగానే తలుపు తీసుకుని సరాసరి వెళ్ళిపోయింది. తిరిగి వెంటనే వెనక్కి తిరిగి రాలేదు. మంజుల వెళ్ళిన పావుగంటకు మంత్రవాది ప్రతాప్ నిద్ర పోతున్న గదిలోకి ప్రవేశించాడు. ప్రతాప్ గుర్రుపెట్టి నిద్ర పోవటం చూసి తనలో తానే నవ్వుకున్నాడు.

మంత్రవాది లేపడంతో ప్రతాప్ కళ్లు నులుముకుంటూ లేచికూర్చున్నాడు. ఎదురుగా మంచంమీద మంజుల కనిపించలేదు. ప్రక్కనే మంత్రవాది కనిపించాడు. దానిని బట్టి పన్నెండు గంటలు దాటి ఉంటుందని అతను గ్రహించాడు.

'నువ్వొస్తావనే నమ్మకంతోనే బాగా నిద్రపోయాను. మంజుల వెళ్లి ఎంతసేపయింది?' ప్రతాప్ అడిగాడు.

'ఓ పావు గంట అవుతుంది. సరే-ముందు మనపని చూసుకోవాలి.'

ప్రతాప్ ఇంకేమీ అడగలేదు. తలుపు నెట్టుకుని రెండో గదిలోకి ప్రవేశించాడు. ఆ వెనకే మంత్రవాది కూడా వెళ్ళాడు. ప్రతాప్ తిన్నగా అల్మారా దగ్గరకు నడిచాడు. దానిపైన ఉన్న దీపపు చెక్కను పైకి ఎత్తాడు. ప్రక్కనే నిలబడి ఉన్న మంత్రవాది ఆతురతగా ముందుకు వంగి చూశాడు.

అక్కడ ఉన్న పెట్టెలో ఆతనికొక తాళం చెవి కనిపించింది. అతడు దానిని చేతిలోకి తీసుకున్నాడు.

'ఇందులోనే ఉంటుంది, ఆ తాళపు చెవి. దానిని మంజుల వెంట తీసుకు వెళ్లింది,' అన్నాడు ప్రతాప్.

'అయితే ఈ తాళపు చెవి ఎక్కడిది?' మంత్రవాది అనుమానంగా ప్రశ్నించాడు.

'ఈ తాళపుచెవి క్రింద ఉన్న అల్మారాది.'

మంత్రవాది ఆ తాళపుచెవితో అల్మారా తాళం తెరిచాడు. దాని తలుపులు తీసి చూశాడు. అందులో చెప్పుకోతగ్గ వస్తువులేమీ లేవు. మంజుల అలంకరించుకోడానికి కావలసిన సామగ్రి అందులో ఉంది. మంత్రవాది మళ్ళీ దానికి తాళం వేసి తాళపుచెవి యథాస్థానంలో ఉంచాడు.

తలుపు మామూలుగా వేసి ఇద్దరూ గదిలోకి వచ్చారు. గదిలోంచి కాసార తీరానికి చేరి కాసేపు ఏవో కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత మంజుల తిరిగి వచ్చేసమయం కాగా ప్రతాప్ మంత్రవాదిని హెచ్చరించాడు.

'మంజుల వచ్చే టైం కావస్తోంది. ఏం చేస్తావ్?'

మంత్రవాది ఆలోచించాడు.

'మంజులవచ్చి నిద్రపోయే వరకు నేను ఇక్కడే ఎక్కడో దాక్కుంటాను. తర్వాతి సంగతి నేను చూసుకుంటాను. మీరు మాత్రం మెలుకువగా ఉండండి,' అన్నాడు చివరికి.

సరేనన్నాడు ప్రతాప్. నెమ్మదిగా తన గదిలోకి నడిచి వెళ్ళాడు. మంత్రవాది ఒక ప్రక్కగా వెళ్ళి చీకటిలో కలిసి పోయాడు.

వెళ్ళి మంచంమీద పడుకున్న ప్రతాప్‌కు నిద్ర పట్ట లేదు. మంజుల ఎప్పుడు వస్తుందా అని అతను ఎదురు చూ

పొగాడు. కాని ఎంత సేపటికి మంజుల రాలేదు. ఇవాళ ఎందుచేతనో చాలా ఆలస్యమైంది. ఎలాగయినాసరే మంజుల వచ్చి నిద్ర పోయే వరకూ తను మెలుకువగా ఉండా లనుకున్నాడు ప్రతాప్.

చాలాసేపయింది. మంజుల కంగారు పడుతూనే గది లోకి ప్రవేశించింది. ప్రతాప్ నిద్రపోతున్నట్లు నిశ్చలంగా పడుకుని ఉన్నాడు. అతని వంక చూసిన తర్వాత మంజుల తన మంచంమీద వెళ్ళి పడుకుంది. రాత్రి ఇప్పటి వరకూ నిద్రలేక పోవడం చేత మంజులకు వెంటనే నిద్ర పట్టేసింది.

మంత్రవాది దర్వాజా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ఒక రెక్కలోనే గదిలోకి తొంగిచూశాడు. మంచంమీద పడు కుని ఓరకంట దర్వాజావంక చూస్తున్న ప్రతాప్ అతనిని లోపలికి రమ్మని సైగచేశాడు. మంత్రవాది గదిలోకి ప్రవే శించి మళ్ళీ తలుపు వేసేశాడు. ప్రతాప్ మంచంమీదనుంచి లేచాడు.

ప్రతాప్ మంజుల మంచందగ్గరకు వెళ్లాడు. ఆమె వంక పరీక్షగాచూసి మంచి నిద్రలో ఉన్నట్లు గ్రహించాడు. ఇక నువ్వేంచేస్తావో చెయ్యి అన్నట్లు మంత్రవాదివంక చూశాడు.

మంత్రవాది తన జేబులోనుంచి చిన్నపెట్టెను బయటికి తీశాడు. అందులోనించి ఒక మత్తుమందును బయటికిలాగి నిద్రపోతున్న మంజుల ముక్కుదగ్గర ఉంచాడు.

ఒక నిమిషం తర్వాత మంత్రవాది మంజుల నాడిని పరీ క్షించాడు. ఆమెకు స్పృహ తప్పిందని రూఢిగా తెలిసిన తర్వాత ప్రతాప్ వంక తిరిగాడు.

ఇద్దరూ ప్రక్కగదిలోకి వెళ్లారు.

'ఇక్కడినుంచి తాళపుచెవి నేను తీసుకువెళ్ళడం మంచిది కాదు. అది ఎట్టి అపాయానికయినా దారి తియ్యవచ్చు. ఒక వేళ మంజుల ఉదయంలేచి తాళపు చెవికోసం వెదికితే మన రహస్యం బయట పడవచ్చు. అందుచేత మరొక పనిచేస్తాను.' అంటూ మంత్రవాది అల్మారాపైనున్న దీపపు చెక్క పైకి ఎత్తి అందులోనుంచి తనకు కావలసిన తాళపుచెవిని బయటికి తీశాడు. తనదగ్గర ఉన్న మైనపు అట్టను బయటికి తీసి దాని మీద ఆ తాళపుచెవి ముద్రను వేశాడు. ప్రతాప్ ఇదంతా మౌనంగా చూస్తూ ఉండిపోయాడు.

మైనపు అట్టను జేబులో భద్రంగాదాచి తాళపుచెవిని యథాస్థానంలో ఉంచి మంత్రవాది వెనక్కి తిరిగాడు. వెనక గదిలోకి వచ్చిన తర్వాత మంత్రవాది ఇలా అన్నాడు.

'మైనపు అట్టమీద ఉన్న తాళపుచెవి ముద్రను బట్టి నేను రేపటికి మరొక తాళపుచెవి చేయించుతాను. మంజుల రేపు అర్ధరాత్రిలేచి వెళ్లేసమయానికి నేనిక్కడికి వచ్చి ఉంటాను. క్రొత్త తాళపుచెవి సహాయంతో మనమిద్దరం మంజులను చాటుగా అనుసరించుదాం.'

ప్రతాప్ ఆనందంతో సరేనన్నాడు.

'అయితే మీ మీద ఎవరికీ అనుమానం కలుగకుండా మీరు జాగ్రత్తపడాలి. మంజుల దగ్గర ఉండే వరూధిని కుతంత్రాలలో నేర్పరి. మిమ్మల్ని ఒక కంట చూస్తూనే ఉంది. ఆమె కన్ను గప్పి నేనిక్కడికి వస్తున్నాను. మనం జాగ్రత్తగా ఉండడం ఎందుకయినా మంచిది. మన రహస్యం బయట పడకూడదు' అన్నాడు మంత్రవాది.

ప్రతాప్ దగ్గర సెలవు తీసుకుని మంత్రవాది వెళ్ళిపోయాడు. ప్రతాప్ పడుకుని నిద్రపోయాడు. పూర్తిగా తెల్లవారే వరకూ మంజులకు కూడా స్పృహ రాలేదు. ఆ

రోజు ప్రొద్దెక్కే వరకూ మెలకువ రానందుకు మంజుల తనలో తాను ఆశ్చర్యపోయింది. క్రమంగా పగలంతా మామూలు ప్రకారం ఆటపాటలతో గడచిపోయింది. చీకటి పడిన దగ్గర్నుంచి ప్రతాప్‌లో ఉత్సుకత పెరగసాగింది. పన్నెండు గంటలు ఎప్పుడు అవుతుందా అని అతను ఎదురు చూడసాగాడు.

అర్ధరాత్రి అయింది. ప్రతాప్ నిద్రపోతున్నట్టు నటిస్తున్నాడు. మంజుల లేచి దీపపు వత్తి తగ్గించి అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

మంజుల వెళ్ళిన కాసేపటికి ప్రతాప్ లేచాడు. మంజుల వెళ్ళిన వైపు తలుపు నెట్టి చూశాడు. మంజుల అప్పటికే ఆ గదిలోనుంచి కూడా వెళ్ళిపోయింది.

వెనక అడుగుల చప్పుడు వినిపించింది. ప్రతాప్ వెనక్కి తిరిగి చూశాడు. మంత్రవాది ఎదురుగా కనిపించాడు.

'తాళపు చెవి తెచ్చావా? మంజుల ఇప్పుడే వెళ్ళింది,' అన్నాడు ప్రతాప్.

'తెచ్చాను. మనంకూడా వెళ్దాం,' అన్నాడు మంత్రవాది.

ఇద్దరూ రెండో గదిలో ప్రవేశించారు. అప్పటికి మంజుల వెళ్ళి పావుగంట అవుతుంది. మంత్రవాది తను తెచ్చిన తాళపు చెవితో తలుపు తాళం తీశాడు. ఇద్దరూ అవతలి వైపుకు వెళ్ళారు. మంత్రవాది అటునించి మళ్ళీ తలుపుకు తాళం వేశాడు.

లోపల బాగా చీకటిగా ఉంది. కళ్ళు పొడుచుకు చూసినా ఏమీ కనిపించడం లేదు. ముందుకు అడుగువేయడానికి ఎవరికీ ధైర్యం చాలడం లేదు. ప్రతాప్ ఎలాగో చివరికి ముందుకి నడవడానికి సిద్ధపడ్డాడు.

కాని ప్రతాప్‌ను ఒక చేత్తో వారించి మంత్రవాది తన దగ్గర ఉన్న కొవ్వొత్తిని బయటికి తీశాడు. దానిని వెలిగించగానే గదంతా కాంతితో నిండిపోయింది. ఆగది చాలా చిన్నది. వాళ్లు ఉన్నచోటినించి ఒక్కడుగు ముందుకు వేసినా అపాయం సంభవించేది.

వాళ్లు నిలబడిన చోటినించే తిన్నగా క్రిందికి మెట్లున్నాయి. షుమారుగా ముప్పై మెట్లవరకు ఉండవచ్చు.

'ఇందుకే తొందర పడకూడదన్నాను,' మంత్రవాది అన్నాడు. ఇద్దరూ మెట్లుదిగి క్రిందికి నడిచారు. అక్కడ ఒక తలుపుఉంది. తన దగ్గర ఉన్న తాళపుచెవితో మంత్రవాది ఆ తలుపుకూడా తియ్యడానికి ప్రయత్నించాడు. అదృష్టవశాత్తు ఆ తలుపు కూడా తెరచుకుంది. కొవ్వొత్తి కాంతిలో ఇద్దరూ అవతలి వైపుకు నడిచి ఆ ప్రక్కనించి మళ్ళీ తలుపుకు తాళంవేశారు.

అదొక పెద్ద సొరంగం. ఆ సొరంగంగుండా ఎక్కడికో వెళ్లాలన్నమాట. ఇద్దరూ నడవడం సాగించారు. సొరంగపు గోడలు రాతితో తయారుచేయబడి పరిశుభ్రంగా ఉన్నాయి. అందుచేత ఈ దారినే మంజాల వెళ్లి వస్తున్నదనీ మరోదారి ఏదీ లేదనీ వాళ్లు గట్టిగా నిర్ణయించుకొన్నారు.

ఆలా ఐదు నిమిషాలు గడిచేసరికి సొరంగం అంతమైంది. అక్కడో తలుపు కనిపించింది. ఆ తలుపుకూడా తాళపు చెవి సహాయంతో తెరచి ఇద్దరూ అవతలి వైపుకు చేరుకున్నారు. తలుపుకు ఆ ప్రక్కనించి మళ్లీ తాళం వేశారు.

మంత్రవాది గది వంక చూశాడు. పైకి మెట్లున్నాయి. షుమారుగా ఇవికూడా ముప్పైమెట్లే ఉంటాయి. మెట్లు కూడా వెనక తాము దిగివచ్చిన వాటిలాగే ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే వెంటనే ఒక గది రావచ్చునని దాని తర్వాత

ఎవరో నివసించే గది కనిపించవచ్చునని వాళ్ళు భావించారు. ఇద్దరూ మెట్లు ఎక్కి తలుపు దగ్గరికి చేరుకున్నారు. ఆ తలుపు కూడా తీసి అవతలి గదిలోకి వెళ్ళి తలుపుకు తాళం వేశారు.

అనుకున్న ప్రకారం ఆ గది దాటితే ఎవరో నివసించే గది వస్తుంది. అందుచేత మంత్రవాది కొవ్వొత్తి ఆర్పేశాడు. ఇద్దరూ గది నాలుగువైపులా పరిశీలించి చూశారు. దీనికి కూడా తలుపు ఉంది. దాని తాళం కోసం ఏర్పాటు చేసిన రంధ్రంగుండా అవతలి గదిలోంచి దీపపు కాంతి ఇవతలి గది లోకి సన్నగా పడుతోంది.

ఆ రంధ్రం గుండా లోపలికి చూద్దామని మంత్రవాది ప్రయత్నించ బోయాడు. ఇంతలోనే వెనక ప్రక్క నించి ఏవో అడుగుల చప్పుడు వినిపించింది. మంత్రవాది కంగారుగా వెనక్కి తిరిగాడు. ఇద్దరూ గబగబా గది మూలకి చేరుకుని చీకట్లో దాక్కున్నారు. ఏదో అపాయం సంభవించ బోతున్నదని మంత్రవాది భయపడ్డాడు. ఒకవేళ తన రహస్యం వరూధిని కనుక్కున్నదేమో!

కాసేపటి వరకు అడుగుల చప్పుడు వినిపిస్తూనే ఉంది. ఇద్దరూ భయంభయంగా మూల నిలబడే ఉన్నారు. ఇలా ఎక్కువసేపు నిలబడితే మళ్ళీ మంజుల తిరిగిరావచ్చు. తను గదిలోకి వెళ్ళిపోయేసరికి ప్రతాప్ కనిపించకపోతే గొడవ చెయ్యవచ్చు. వెదకటానికి ఏర్పాటు చెయ్యవచ్చు. అప్పుడు తమ రహస్యం తప్పక బయటపడుతుంది. 'మంత్రవాది, ప్రతాప్ ఇద్దరూ బోనులో చిక్కిన ఎలుకల్లా మూల చీకటిలో ఒదిగి ఉన్నారు. ఇద్దరిదృష్టి అవతలి తలుపుమీద ఉంది.

అకస్మాత్తుగా ఆ తలుపు తెరచుకుంది. ఆ తలుపుగుండా ముసుకు వేసుకున్న ఒక ఆకారం తిన్నగా గదిలోకి వచ్చి

ఎదటి తలుపు దగ్గరకు వెళ్ళింది. ఇద్దరూ ప్రాణాలు బిగ బట్టుకుని ఊపిరికూడా వదలకుండా ఆ ఆకారం వంక చూస్తూ ఉండిపోయారు. తలనించి కాళ్ళదాకా ముసుగు ఉండడం చేత ఆ ఆకారం ఆడో మగో గుర్తు పట్టడానికి వీలులేకుండా ఉంది. ఆ ఆకారం తలుపు దగ్గరకు వెళ్ళి రంధ్రం గుండా లోపలికి చూసింది. మళ్ళీ వెంటనే వెనక్కి తిరిగి వెనక తలుపు దగ్గరకు వెళ్ళింది. తలుపుతీసి అవతలి వైపు నించి తాళం వేసి వెళ్ళిపోయింది. క్రమంగా అడుగుల చప్పుడు అంతమైంది. గదిలో ఉన్నంతసేపూ ఆ ఆకారం ప్రక్కలకు చూడనేలేదు. బ్రతికిపోయాం అనుకున్నాడు మంత్రవాది.

ఆ ఆకారం వెళ్ళిపోగానే మంత్రవాది ఒక్క అంగలో ముందుకు వెళ్ళాడు. ప్రతాప్ కూడా అతనిని అనుసరించాడు. మంత్రవాది తలుపు రంధ్రం గుండా అవతలికి చూశాడు.

అవతలి గది చక్కగా అలంకరింపబడి ఉంది. గోడకు తగిలింపబడి ఉన్న పెద్ద దీపం కాంతివంతంగా వెలుగు తోంది. గది మధ్యగా ఒకే ఒక మంచం ఉంది. దాని మీద విలువైన పరుపు, దుప్పట్లు ఉన్నాయి. మంజూల, నలభై సంవత్సరాలు దాటిన ఒక పురుషుడు కూర్చుని కబుర్లు చెప్పు కుంటున్నారు. నవ్వుతూ మంజూల అతనితో ఏదో చెబు తోంది. అతను దిండుకాని కూర్చుని ఊ కొడుతూ వింటు న్నాడు. ఆవ్యక్తి ముఖం చూడటానికి చాలా అసహ్యంగా ఉంది. మంజూల ఆ అనాకారి కోసమే ఇక్కడికి వస్తున్న దన్నమాట.

మంత్రవాది ఆలోచించాడు. ఈ అనాకారికోసం మంజూల తప్పని సరిగా రోజూ రావడానికి ఏదో కారణం ఉండి ఉండాలి. ఒక్కరోజు కూడా ఆమె ఇక్కడకు

రాకుండా ఉండలేకపోతున్నదంటే అందుకేం కారణం ఉంటుంది/ ఈ వ్యక్తి అందంగా కూడా లేడు, ఆకర్షింప బడడానికి. మంత్రవాది కాసేపు అలాగే ఆ రంధ్రంగుండా ఇద్దరినీ చూస్తూ ఉండిపోయాడు.

మంత్రవాది తలుపు దగ్గరినించి తప్పుకుని ప్రతాప్‌ను చూడమన్నాడు. మంత్రవాది ఇప్పటి దాకా ఏం చూస్తున్నాడా అనుకొంటున్న ప్రతాప్ గబగబా తలుపు ముందుకు వెళ్ళాడు. రంధ్రంగుండా లోపలి దృశ్యాన్ని చూశాడు, అతని ఒళ్ళు మండిపోయింది. కోపానికంతు లేక పోయింది. తనను ప్రేమిస్తున్నట్టు నటిస్తూ మంజుల చేస్తున్న పని చూడగానే అతనికి చెప్పరానంత అసహ్యం వేసింది. వాళ్లేం మాట్లాడు కుంటున్నారో వినాలని ప్రయత్నించాడు, కాని వినపడలేదు.

ప్రతాప్‌కు అనేక అనుమానులు కలిగాయి. మంజులకు పెళ్ళయిందా? పెళ్లయినతర్వాత తనతో ఇలా ప్రవర్తిస్తున్నదా? లేకపోతే ఈ మనిషి ఎవరు? మంజుల ఇతన్ని రోజూ ఇక్కడ ఎందుకు కలుసుకుంటున్నది?

మంజుల ఆ పురుషుడితో చెబుతున్న కబుర్లు ఆపేసింది. అతని ఒళ్లో తలపెట్టుకుని ఆప్యాయంగా పడుకుంది, ప్రతాప్‌కు మళ్ళీ కోపంవచ్చింది. పరాయివాళ్ల దగ్గర అలా ప్రవర్తిస్తున్న మంజుల తన దగ్గరకూడా అలాగే ప్రవర్తిస్తున్నది ఒక వేళ తనే పరాయివాడు కావచ్చు. వినా మంజుల తనను మోసం చేస్తున్నది. నీచురాలు.

తాళం తీసి ఉన్నఫళంగా లోపలికి వెళ్లి మంజులను హింసించాలనుకున్నాడు ప్రతాప్. అతని ఆవేశానికి పట్టపగ్గాలు లేక పోయాయి. కాని మంత్రవాది అతనిని వారించి వెళ్ళిపోదాం రమ్మని సైగ చేశాడు. ప్రతాప్ తన ఆవేశాన్ని

ఎలాగో అనుకొని మంత్రవాది వెంటనడిచాడు. ఇద్దరూ తమ తాళపుచెవిని ఉపయోగిస్తూ వచ్చినదారికే వెనక్కి వచ్చే శారు. ఇంకా మంజుల రావడానికి ఒక అరగంట వ్యవధి వుందని వాళ్లు భావించారు.

'కాసారం దగ్గరకు వెళ్దాం,' అన్నాడు మంత్రవాది.

ఇద్దరూ కాసారం దగ్గరకు వెళ్ళి రాతి మీద కూర్చున్నారు. నలుదిక్కులా నిశ్శబ్దం ఆవరించింది. బాగా చీకటిగా కూడా ఉంది.

'మీరు వాళ్ళున్న గదిలోకి వెళ్తానన్నారు. అది ఎంత అపాయకరమో మీకు తెలియదు. ఇది సాధారణమైన భవనం కాదు. ఇందులో జనం లేరని మీరనుకున్నారేమో. వేలకొలది సైనికులు ఈ భవనానికి కాపలా ఉన్నారు. వాళ్లందరి ముందు మనిమిద్దరం ఏమీ చెయ్యలేం. అటువంటి పరిస్థితిలో మనం వాళ్ళ చేతిలో చిక్కిపోవడం శ్రేయస్కరం కాదు,' మంత్రవాది అన్నాడు.

'ఐతే నేను తప్పించుకుపోవడానికి మార్గం!'

'దాన్ని గురించి మీరాలోచించకండి. ఆఏర్పాటంతా నేను చేస్తాను. ఇంకా కొన్నాళ్ళు మీరీ భవనంలో ఉండాలి. అప్పుడు ఎట్టికష్టమూ లేకుండా మీరు బయట పడగలరు.'

'కాని ఈ నీచురాలితో నేను ఇంకా కొన్ని రోజులు ఎలా ఉండగలను?'

'ఎలాగో ఒకలా ఉండాలి, ఆమె రహస్యం మనం తెలుసుకుంటున్నట్టు ఆమెకు తెలియనివ్వకూడదు.'

'ఇంతకీ మంజుల కలుసుకొంటున్న ఆ వ్యక్తి ఎవరు? ఆమె ఎన్నడూ తనకు వివాహమైనట్టు చెప్పలేదే!'

'అతనెవరో నాకూ తెలియదు. తెలుసుకుంటాను. ఒక్కో రోజులో నేను ఈ రాజ్యపు రహస్యాలన్నీ తెలుసుకుంటాను. తద్వారా మిమ్మల్ని విడిపించడానికి ప్రయత్నిస్తాను. అంతే కాదు, ఈ రాజ్యం కూడా మీ వశంకావడానికి అవకాశం ఉంది. ఆ అవకాశం వినియోగించుకోవడం మన ధర్మం.' మంత్రవాది నెమ్మదిగా అన్నాడు.

ప్రతాప్ కాసేపు మాట్లాడ లేదు. ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉన్నాడు.

'మనసైన్యాన్ని రప్పించి ఈ రాజ్యం మీద దండెత్తవచ్చు. సులభంగా జయించవచ్చు కూడా,' ప్రతాప్ అన్నాడు.

'అది అంత సులభమైన పని కాదు. అంతే కాకుండా యుద్ధం జరగకుండానే రాజ్యం మనచేజిక్కే మార్గం ఉండగా యుద్ధం దేనికి?' మంత్రవాది అన్నాడు.

'సరే. నువ్వు మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?'

'రెండు మూడు రోజుల్లో అన్ని విషయాలూ సమగ్రంగా గ్రహించి——'

మంత్రవాది తన మాటలు పూర్తి చెయ్యనే లేదు. భవనం లోనించి మంజుల కాసారం దగ్గరగా వస్తున్నట్టు అతను గ్రహించాడు. ఇక్కడ ఇంత ఆలస్యం చేస్తూ కూర్చున్నందుకు తనలో తానే నొచ్చుకున్నాడు. మంజులను ఎలాగైనా సమాధాన పర్చమని ప్రతాప్‌కు చెప్పి మంత్రవాది రాతి ప్రక్కగా దేకుతుంటూ ఎవరికీ కనిపించకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ప్రతాప్ మంజులను చూడనట్టు నటిస్తూ కాసారం వైపు తిరిగి కూర్చున్నాడు. మంజుల అక్కడికి వచ్చింది. అతని ప్రక్కనే కూర్చుంటూ, 'చెలికత్తెకు జబ్బుచేసిందని కబురు వస్తే చూడడానికి వెళ్ళాను, మీరిక్కడ కూర్చున్నారే?'

అంది. లోలోపల ఆమె ఎందుకో కంగారు పడుతోంది. ప్రతాప్ మంజుల వంక చూశాడు. 'నాకు మెలుకువ వచ్చేసరికి నువ్వు లేవు. ఎక్కడికి వెళ్లావో తెలియదు. మళ్ళీ నిద్రపట్టలేదు. ఏమీ తోచక ఇటు వచ్చాను,' అన్నాడు.

'నేను వెళ్ళేప్పుడు మీరు గాఢ నిద్రలో ఉన్నారు. నిద్ర లేపటం దేనికని ఒంటరిగానే వెళ్ళాను,' అంది మంజుల.

## 10

తెల్లవారింది. అంధకారం అంతరించింది. వెలుగురేఖలు పొడచూపినాయి. కొంచెం ఎత్తుగానే ఉన్న ఆ కొండ మీద కూర్చుని మంత్రవాది, తన అనుచరుడైన నేపాళితో మాట్లాడుతున్నాడు. ఇద్దరూ అప్పుడప్పుడూ నాలుగు వైపులా పరికిస్తున్నారు.

'ఏమిటి సంగతులు? విశేషాలేమైనా తెలిశాయా?' నేపాళి మంత్రవాదిని అడిగాడు.

మంత్రవాది నెమ్మదిగా నవ్వాడు.

'ఆ మాత్రం తెలుసుకోకుండా నేను ఊరుకుంటానా? ఈ రాజ్యపు సంగతి సందర్భాలన్నీ కనుకున్నాను,' మంత్రవాది అన్నాడు.

'కొంచెం నాకూడా చెబుదూ?' అన్నాడు నేపాళి.

'ప్రతాప్ గారు కూడా ఈవిషయాలన్నీ తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగా ఉన్నారు, సరే, చెబుతా విను. మంజుల తల్లిదండ్రులు రాజ్యాన్ని ఆమె పేర అప్పగించి ఆమె చిన్నప్పుడే చనిపోయారు. పాపం మంజుల అప్పటికి చాలా చిన్నది. పైగా తల్లిదండ్రులు విలాసవ్యక్తులు కావడం చేత ఆమెకు చదువుసంధ్యలు, గుణగణాలు నేర్పలేదు. ఆమె తల్లిదండ్రులు చనిపోగానే మంజుల తండ్రి బావమరది శూరసేనుడు

రాజ్యాన్నంతా గుప్పెటలో పెట్టుకున్నాడు. ఆయనే అసలు సైన్యానికి అధిపతి కూడా. రాజ్యానికి మంత్రి భైరవునితో కలిసి మంతనాలాడి రాజ్యాన్ని తన చేతిలో ఉంచుకున్నాడు శూరసేనుడు. పేరుకు మాత్రం మంజుల పేర ఉన్నది. రాజ్యంకోసం మంజుల శూరసేనుడికి లోబడింది.'

'అతని దగ్గరికేనన్నమాట మంజుల రోజూ అర్ధరాత్రి వెళ్ళేది!' నేపాళి అనుమానంగా అన్నాడు.

'ఔను. మంజుల అందచందాలకు శూరసేనుడు ముగ్ధుడై పోయాడు. అతనంటే మంజులకు ఏ మాత్రం ఇష్టం లేదు. వినా రాజ్యమంతా అతని ఆధీనంలో ఉండడం వల్ల మంజుల అతనికి లోబడక తప్పలేదు. మంత్రి భైరవుడు కూడా మంజుల మీద కన్ను వేసేఉన్నాడు. వీళ్ళందరి మధ్య నలుగుతూ మంజుల ప్రతాప్‌ను లోబరచుకోవాలని చూస్తోంది.'

'ఇదంతా తెలిస్తే ప్రతాప్‌గారు మంజులను ఎంత అసహ్యించుకుంటారో!'

'అందుకే ఆయన్ని విడిపించే ఏర్పాటు మనం చెయ్యాలి. దానితోపాటు రాజ్యం కూడా మన చేజిక్కేట్టు చూసుకోవాలి.'

'అందుకు మనం ఏం చెయ్యాల్సి ఉంటుంది?'

'ముందు శూరసేడిపనీ, మంత్రి భైరవుడిపనీ పట్టాలి. ఆ ఇద్దరినీ అణచి వేస్తే మిగిలిన పనంతా ఐపోయినట్టే.'

'సరే. ఐతే నేను ఆ మంత్రిగారి పని పడతాను. మీరు శూరసేనుడి సంగతేమిటో కనుక్కోండి.'

మంత్రవాది కాసేపు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. చివరికిలా అన్నాడు.

'అలాగే చేద్దాం. మన మిద్దరం ఆ ఇద్దరి అంతూ తేల్చుకుందాం. ఎవరి సహాయమూ లేకుండానే సునాయాసంగా మన పనిని మనం నిర్వర్తించగలం. అందుకు సందేహం లేదు. మనకు విజయం తప్పదు.'

ఇద్దరూ లేచారు. అడుగులో అడుగు వేసుకుంటూ కొండ దిగసాగారు. ఇంతలో ఓ ప్రక్కనించి ఏదో శబ్దం వినిపించింది. ఇద్దరూ పరీక్షగా అటు చూశారు. కాని ఎవరూ కనిపించలేదు. చివరికి కొండదిగి తామునిర్ణయించుకున్న ప్రకారం ఎవరి పనిమీద వాళ్ళు వెళ్ళి పోయారు.

★

మంత్రవాది తన అనుచరుని సహాయంతో ఏం చేశాడు? ప్రతాప్‌మంజుల రహస్య మందిరంనించి ఎలా బయటపడ్డాడు? జయంత్, ప్రతాప్ ఏవిధంగా కలుసుకున్నారు? తర్వాత ఏంజరిగింది? మొదలైన విషయాలు 'మహామాయ' రెండవ పుస్తకం 'రక్తదాహం'లో చదవండి.

చదవడం ఆరంభిస్తే వదలలేని అద్భుతమైన నవల

# మహోమాయ

మహత్తరమైన

డిటెక్టివ్ & మిస్టరీ నవల

రచన: కనకమేడల

ఒక్కొక్క భాగం వెల రు. 0-8-0

**1, 2, భాగాలు సిద్ధంగా ఉన్నాయి.**

**3, 4, భాగాలు ఆగస్టులో వెలువడతాయి.**

ముచ్చటైన మూడురంగుల ముఖచిత్రాలు. పాకెట్ సైజులో నెలకు రెండు భాగాల చొప్పున ఎన్నో భాగాలుగా వెలువడ నున్న ఈ సీరియల్ నవల, డిటెక్టివ్ &మిస్టరీ సాహిత్యంలో నూతన సృష్టి.

**ఏజెంట్లు కావలసిన పుస్తకాలకు సొమ్ముతోసహా ఆర్డర్లు పంపండి.**

ఏజెంట్ల దగ్గర ప్రతులు దొరకని పక్షంలో పాఠకులు మాకు డబ్బుపంపి తెప్పించుకోవచ్చు.

## విజ్ఞాన సాహితి

టి. నగర్ : : మద్రాసు—17.

వెలువడింది

# మోసగించిన వీలునామా

(డిటెక్టివ్ కథలసంపుటి)

రచన: కనకమేడల

త్రివర్ణ ముఖచిత్రం: వెల రు. 0-8-0

ఆకాశపథంలో విహరించే పక్షిలా ఆలోచనా పథంలో నిత్యమూ చరిస్తుంది, మేధావంతుడైన ఇంద్రజిత్ మనస్సు. ఆ ఆలోచనల ఫలితాలే ఈ కథలు.

ఏజెంట్లు ఆర్డర్లతోపాటు సొమ్ము పంపండి.

ఎం. వి. యస్. పబ్లికేషన్స్

21 పెరుమాళ్ మొదలివీధి, సౌకార్‌పేట,

మద్రాసు—1.

మా ఇతర ప్రచురణలు

1. ప్రేమకోసం (సాంఘికం) రు. 1-0-0
2. మహామాయ—1 రు. 0-8-0
3. మహామాయ—2 రు. 0-8-0

గీతాంజలి (ఠాగూరు:

(కనకమేడల అనువాదం) రు. 1-0-0

కథానిక (1, 2భాగాలు) ఒక్కొక్కభాగం .1-0-0

స్టేజి నాటికలు (కనకమేడల) రు. 0-8-0

నేడే డబ్బు పంపి ప్రతులు తెప్పించుకోండి.

విజ్ఞాన సాహితి

టి. నగర్ :: మద్రాసు-17.

MAHAMAYA - I Re. 0-8-0

# అర్ధరాత్రి

- ఈ నవలలో మాయలకు, మంత్రాలకు చోటులేదు. గూఢచారుల తంత్రాలు విచిత్రంగా ఉంటాయి.
- ఈ నవలలోని కొండ గుహలు, సొరంగాలు, విచిత్రమైన భవనాలు మానవసాధ్యమైన నిర్మాణాలే.
- ప్రఖ్యాత రచయిత కనకమేడల ప్రతిభావంతంగా వ్రాసిన ఈ నవల మీకు ఆనందాన్ని, వినోదాన్ని చేకూర్చగలదు.

ప్రతాప్, జయంత్ చల్లని వెన్నెల్లో పడవమీద గోదావరి నదిలో షికారు వెళ్తుండగా ఓచోటినుంచి మృదుమధుర సంగీతం వినిపించింది. ఇద్దరూ అదేమిటో చూద్దామని వెళ్లారు. అంతే మళ్లీ తిరిగి రాలేదు.

జయంత్ ఒక అందగత్తెచేత రహస్య మందిరంలో బంధింప బడ్డాడు. చివరికొక వ్యక్తి సాయంతో ఆ భవనంలోంచి బయట పడతాడు. అనేక వింతల్ని, విచిత్రాలని చూస్తాడు.

ప్రతాప్ మరొక సుందరాంగి మందిరంలో బందీ ఐనాడు. ఆమె ప్రేమకు తాత్కాలికంగా లొంగిపోయాడు. కాని ఆమె అర్ధరాత్రి అతను నిద్రిస్తుండగా ఎక్కడికో నిత్యం లేచి పోతుంది. ప్రతాప్ ఆ రహస్యం కనుక్కోవాలని చూస్తాడు అందుకోసం అతను అనేకసమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది.

A Vignana Sahiti Publication in Telugu